వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 09 జనవరి 2025

## వెల్లాల హుండీ ఆదాయం రూ.13లక్షలు

రాజుపాళెం, జనవరి08, ప్రభాతవార్త.



మండల పరిధిలోని వెల్లాల పుణ్య క్షేత్రంలోని శ్రీసంజీవరాయస్వామి, శ్రీచెన్నకేవవస్వామి, శ్రీభీమలింగేవ్వరస్వామి ఆలయాలలోని హుండీ లెక్కింపు బుధవారం ఇఓ కెవి రమణ ఆద్వర్యంలో సంజీవరాయస్వామి మంటపంలో నిర్వహించారు. ఈ హుండీలెక్కింపులో స్వామివారికి రూ.13లక్షల 15వేల960 లు ఆదాయం వచ్చినది,దీంతోపాటు స్వామి వారి భక్తులు మ్రొక్కులు చెల్లించి, ఇచ్చిన వాటిని సేకరించిన తలనీలాల వేలంలో రూ.2లక్షల65వేలు ఆదాయం వచ్చినది.వెల్లాల పుణ్యక్షేత్రంనకు మొత్తం రూ.15లక్షల80వేల960 ఆదాయం వచ్చినది. తలనీలాల వేలం పాట,టెంకాయల అమ్మకం,పచ్చికొబ్బెర చిప్పల సేకరణ వేలం పాటలు వాయిదా పడినట్లు ఆలయం ఇఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి,జియల్ నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రామ్మోహన్, ఆలయ పండితులు, భక్తులు, ఇతరులు పాల్గోన్నారు.

## నరసింహస్వామి ఆలయంలో 10న వైకుంఠ ఏకాదశి

మదనపల్లె, జనవరి 8 ప్రభాతవార్త :



పట్టణ సమీపంలోని అనపగుట్టవద్ద ఉన్న శ్రీవారినగర్‌లో వెలసియున్న శ్రీ అభయ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో 10న శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా జరగనున్నట్లు ఆలయ నిర్వాహకులు రమేష్‌స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 3గంటలకు శ్రీ అభయ లక్ష్మీనరసింహస్వామికి పంచామృతాభిషేకం, 5గంటల నుంచి ఉత్తర ద్వార ప్రవేశం ఉంటుందన్నారు. భక్తాదులు ఉత్తర ప్రవేశం చేసి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆయన కోరారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారిని ప్రత్యేక అలంకరణ చేయనున్నట్లు తెలిపారు. ఆలయం కూడా విద్యుత్ దీపాలతో అలంకరింపబడుతుందన్నారు.

# రాయచోటి కడప 4 కిలోమీటర్ల టన్నెల్ ను వెంటనే ఏర్పాటు చేయాలి

కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీనీ కోరిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

పలు అంశాలను కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లిన రవాణా శాఖ మంత్రి.. నాలుగు లైన్ల టన్నెల్ ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు రాగానే పనులు చేపట్టేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్.

కడప నుండి రాయచోటి వరకు 4 లేన్ల రహదారిని మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరిన ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ మండిపల్లి.

రాయచోటి జనవరి 8 ప్రభాతవార్త

రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి న్యూఢిల్లీలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీతో ఆయన నివాసంలో సుమారు 1గంట పాటు సమావేశమై పలు రవాణా అంశాలపై చర్చించారు. రోడ్డు భద్రతా ప్రమాదల నివారణ లో భాగంగా కడప రాయచోటిలో 4 కిలోమీటర్ల టన్నెల్ ఏర్పాటుకు సర్వం సిద్ధం కాగా ఇటీవల సమగ్ర నివేదిక కేంద్ర రవాణా బృందంసిద్ధం చేసిందని, నాలుగు లైన్ల టన్నెల్ ఏర్పాటుకు అటవీ శాఖ అనుమతులు రాగానే పనులు చేపట్టేందుకు కేంద్రం ఆమోదం రూపంలో సహకారం అందివ్వాలని మంత్రి రాంప్రసాద్ కోరారు. అందులో భాగంగా రాయచోటి లో సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్షన్ నిధుల ద్వారా రోడ్ల విస్తరణ గ్రామాల మండలాల కేంద్రాల మరియు జిల్లా హెడ్ క్వార్టర్స్ మధ్య మెరుగైన కనెక్టివిటీ సులువుతరం చేసేందుకు నిధులు మంజూరు చేయాలని, ఎన్‌హెచ్ నేషనల్ హైవేస్ లాజిక్ మేనేజ్మెంట్ ప్రాజెక్టును ఆమోదించి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టే విధంగా ఆదేశాలు జారీ చేయాలని, కడప నుండి రాయచోటి వరకు 4 లైన్ల రహదారిని మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని,అదేవిధంగా రాజంపేట రాయచోటి కదిరి రహదారి రాష్ట్ర రహదారి నుండి జాతీయ రహదారిగా మెరుగుపరిచేందుకు శాఖపరమైన ఆదేశాలు జారీ చేయాలని అదే విధంగా కేంద్ర మంత్రిని రవాణా శాఖ మంత్రి కోరారు. దీంతో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పందిస్తూ రాష్ట్ర రవాణా అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖకు సంబంధించిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.








## కరువు బృందానికి రైతులు కష్టాల నివేదన

తంబళ్లపల్లె జనవరి 8 ప్రభాతవార్త :



మండలం కోటకొండ పంచాయతీలో బుధవారం పర్యటించిన కేంద్ర కరువు బృందానికి స్థానిక రైతులు తమ కష్టాల వెతలు నివేదించారు. ఉదయం సచివాలయంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మెగాస్వరూప్, జేడి చంద్రనాయక్, ఆధ్వర్యంలో కరువు బృందం జాయింట్ సెక్రెటరీ పెరందేవి, డిప్యూటీ డైరెక్టర్ సుప్రియ, రీసెర్చ్ ఆఫీసర్ అనురాధ బృందాలు రైతులతో కరువు నష్టం పై సుదీర్ఘ విచారణ జరిపారు. రైతులు వేరుశనగ, టమోటా ఇతర పంటలు సకాలంలో వర్షాలు లేక పూర్తిగా పంట నష్టం వాటిల్లిందన్నారు. పశువులకు పశుగ్రాసం లేక పాల దిగుబడి తగ్గిందని, ఉపాధి హామీ కరువు పనులు విరివిగా కల్పించి పని దినాలు పెంచాలని, పంట నష్టపరిహారం, విరివిగా సబ్సిడీ రుణాలు, పశుగ్రాసం ఏర్పాటు చేయాలని కోరారు. జాయింట్ సెక్రెటరీ ఫెరందేవి మాట్లాడుతూ రైతుల కరువు కష్టాలను కళ్ళారా చూడటమే కాకుండా రైతుల ఆవేదన గుర్తించామని, కరువు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించకపోవడం పై అసహనం వ్యక్తం చేశారు. తంబళ్లపల్లె ప్రాంతంలోని కరువును స్థానిక రైతులు, ప్రజల పడుతున్న కష్టనష్టాలతో పాటు సమస్యలను గుర్తించామని కరువు నివేదికలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడి శివశంకర్, పశుసంవర్ధక శాఖ ఏడి సుమిత్ర, ఏవో రమణ కుమార్, తాసిల్దార్ హరిప్రసాద్, మండల పశు వైద్యాధికారిణి సుజనశ్రీ, టిడిపి నాయకులు చిన్న రెడ్డప్ప, రాజేష్, గురుమూర్తి, మోపూరి రెడ్డప్ప, సర్పంచ్ తాళ్ల చంద్రశేఖర్, వాటర్షెడ్ చైర్మన్ మల్లికార్జున రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## జంట హత్య నిందితుడు అరెస్ట్

పులివెందుల, జనవరి 8, ప్రభాతవార్త :



తొండూరు మండలం తేలూరు గ్రామంలో భార్య, కూతురును చంపిన నిందితుడిని అరెస్ట్ చేసినట్టు పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. బుధవారం పులివెందుల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముద్దాయి తుమ్మల గంగాధర రెడ్డి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ, రోజూ మద్యం త్రాగి వచ్చి తన భార్య తో గొడవ పడుతూ ఉండేవాడని, మద్యం తాగడానికి డబ్బులు అడుగగా అందుకు ముద్దాయి భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో మీ అంతు చూస్తానని బెదిరించి, అర్ధరాత్రి సుమారు 1.00 గంట సమయంలో ముద్దాయి తన భార్యతో గోడవపడి ఇంట్లో ఉన్న ఇనుప పైపు ను తీసుకుని ముద్దాయి తన భార్య శ్రీలక్ష్మి తలపైన గట్టిగా మూడు నాలుగు సార్లు కొట్టగా, కూతురు గంగోత్రి మంచం పై నుండి లేచి అడ్డుపడుతుండగా అదే ఇనుప పైపుతో కూతురు గంగోత్రి తలపై కూడా రెండు మూడు సార్లు బలంగా కొట్టడంతో ఇద్దరూ గట్టిగా అరుస్తూ తల నుండి రక్తం కారుతూ చెరో మంచం పై పడిపోయినట్లు తెలిపారు. అంతట కొన ఊపిరితో ఉన్న ఇద్దరినీ ఇంట్లో ఉన్న మచ్చుకత్తి తో ముందుగా భార్య శ్రీలక్ష్మీని, తరువాత కూతురు గంగోత్రిని నరకగా ఇద్దరూ చనిపోయారన్నారు. ఈ కేసులోని ముద్దాయిని బుధవారం మధ్యాహ్నం 02.30 గంటలకు టి.తుమ్మలపల్లె రోడ్డులో చీనీ తోట వద్ద అరెస్టు చేశామని ఆయన తెలిపారు. ముద్దాయిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రామచంద్ర, పోలీసులు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కాశినాయన, జనవరి 8 ప్రభాతవార్త

పేద బడుగు బలహీన వర్గాల సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బద్వేల్ నియోజకవర్గం టిడిపి సమన్వయకర్త రితేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సావిశెట్టిపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలు పార్టీలకు అతీతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. చెరువుకు నీటి సరఫరా అందించాలని ప్రజలు విన్నవించుకోవడంతో చెరువులకు సంబంధించి ప్రత్యేక సదస్సులు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన అన్నారు. అతి త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలు పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలని ఆయన అన్నారు. లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పన్నారు. సావిశెట్టిపల్లె,అక్కెంగుండ్ల గ్రామ పొలాల్లో వందల ఎకరాల భూములను ఇతర రాష్ట్రాలకు చెందినవారు ఆక్రమణకు గురి చేశారని ఆయన దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లగా ఈ భూ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామాలలో సిమెంటు రోడ్లు స్ట్రీట్ లైట్లు మొదలైన అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని వారు హామీ ఇచ్చారు.గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నాయని విషయంపై సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గురివిరెడ్డి, మండల నాయకులు రాజా రెడ్డి,బసిరెడ్డి రవీంద్ర రెడ్డి,వేణుగోపాల్ రెడ్డి,విజయ్ కుమార్ రెడ్డి, డి.వి.సుబ్బారెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి,గోపవరపు కేశవరెడ్డి,జగదీశ్వర్ రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఐసిడిఎస్, వైద్యారోగ్య శాఖ లక్ష్యాలలో

# చిత్తశుద్ధితో ప్రగతి సాధించాలి

వెనుకబడిన అంశాలలో లోపాలను గుర్తించి సరిదిద్దుకోవాలి

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి...జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి జనవరి 8 ప్రభాత వార్త



మహిళా శిశు సంక్షేమం, ప్రజల ఆరోగ్య సంరక్షణ అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలలో చిత్తశుద్ధితో ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఐసిడిఎస్, వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుండి ఐసిడిఎస్ సిడిపివోలు, సూపర్వైజర్లు అంగన్వాడీలు, వైద్యారోగ్య శాఖ మెడికల్ అధికారులు, సిబ్బందితో ఆయా శాఖల అంశాలలో సాధించిన ప్రగతి, సాధించాల్సిన ప్రగతి, ఏయే అంశాలలో వెనుకబడి ఉన్నారు, అందుకు గల కారణాలు తదితరాలలో కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. మొదట ఐసిడిఎస్ శాఖకు సంబంధించి పోషన్ ట్రాకర్ డైలీ మానిటరింగ్, ఇమేజ్ క్యాప్చరింగ్, పిల్లల హాజరు, పోషన్ ట్రాకర్ హౌస్ విజిట్స్, బాల సంజీవిని, బాలామృతం, పాలు, కోడిగుడ్ల పంపిణీ తదితర అంశాలలో సూపర్వైజర్స్, సిడిపిఓల పనితీరుపై సమీక్షి. లక్ష్యాలలో వెనుకబడిన వారిని కారణాలు అడిగి తెలుసుకుని, తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు త్రాగునీరు, విద్యుత్ కనెక్షన్స్ తదితర అంశాలలో సమీక్షించారు. అంగన్వాడీ కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలని పిల్లల హాజరు వందశాతం ఉండేలా కృషి చేయాలన్నారు. కేంద్రానికి పిల్లలు రాకున్నా హాజరు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ప్రగతి సాధనకు శ్రద్ధ పెట్టండి

వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి సమీక్షిస్తూ వివిధ అంశాలలో శ్రద్ధ పెట్టి లక్ష సాధనకు కృషి చేయాలని మెడికల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌బిఎస్‌కే స్కూల్ హెల్త్ స్క్రీనింగ్, ఎన్‌సిడి 3.0, ఆర్‌సిహెచ్ ప్రోగ్రాం, పిడబ్ల్యు అబా లింకేజ్ ప్రోగ్రాం, అన్మోల్, అనీమియా మానిటరింగ్ తదితర అంశాలలో మెడికల్ అధికారులతో సమీక్షించారు. ఆయా అంశాలలో కొన్ని మండలాలు ప్రగతి సాధనలో బాగా పని చేస్తున్నాయని, మిగిలిన మండలాలు వెనుకబడి ఉన్నాయని ఇందు గల కారణాలను లోపాలను గుర్తించి సరిదిద్దుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. ఏఎన్ఎం తరచు పాఠశాలలను సందర్శించి వైద్య సేవలు అందించాలన్నారు. జీరో శాతం ప్రగతి ఉన్నవారు మూడు రోజుల లోపల ప్రగతి సాధించకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిఎంహెచ్వోను ఆదేశించారు. బాగా వెనకబడి ఉన్న పారామీటర్స్లో లోపాలు ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటిని ఏ విధంగా అధిగమించాలి, అందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఆయా అంశాలలో ప్రగతి సాధనకు ప్రతి శుక్రవారం మెడికల్ అధికారులు, ఏఎన్ఎంలతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించాలని, అలాగే ప్రతి మంగళవారం జూమ్ మీటింగ్ ద్వారా ఆయా అంశాలలో లక్ష్యాలను సమీక్షించాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తమ సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను వైద్యశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో, ఐసిడిఎస్ పిడి, వైద్యాధికారులు, సిడిపివోలు, ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కరువు మండలాలకు కేంద్ర సాయం అవసరం

జిల్లా కలెక్టర్ శ్రీదర్ చామకూరి



మదనపల్లె, జనవరి 8 ప్రభాతవార్త :

జిల్లాలో తీవ్రమైన కరువును ఎదుర్కొన్న మండలాలకు కేంద్రసాయం అవసరమని జిల్లాన కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు.బుధవారం జిల్లాలో కరువు మండలాల పరిశీలన కోసం కేంద్ర ప్రభుత్వం సుప్రీయ మాలిక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల బృందనం జిల్లాలోని బి.కొత్తకోట, వాల్మీకిపురం, మదనపల్లె, తంబళ్ళపల్లె తదితర మండలాలను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం ఖరీఫ్ సీజన్‌లో పడిన వర్షపాతం, పవువులకు అందుబాటులో ఉన్న పశుగ్రాసం, పండించిన పంటలు, నష్టాలు తదితర విషాయలపై రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతులు గతంలో మాదిరి పశువులకు పశుగ్రాసం అందించగలిగితే తమకు ఎంతో సాయంగా ఉంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌డిఆర్ఎఫ్ నిబంధన ప్రకారం కరువు మండలాలకు రూ.11కోట్లు మంజూరు చేయాల్సి ఉందని తెలిపారు. ఖరీఫ్‌సీజన్‌లో 2024లో జిల్లాలో వర్షపాతం తక్కువుగా నమోదైందని పలు మండలాలు కరువు బారిన పడి ఇబ్బందులకు గురియ్యారన్నారు. జిల్లాలోని 19మండలాలను తీవ్రమైన కరువు మండలాలుగా ప్రకటించినట్లు తెలిపారు. కరువు మండలాల్లో దాదాపు 33శాతం పంటనష్టం వచ్చిందని తెలిపారు. ముఖ్యంగా వేరుశెనగ బాజ్ర పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు.

వ్యవసాయ మీద కాకుండా పశువులపై ఆధారపడి జీవనం సాగించే రైతులుకూడా ఎంతో నష్టపోయారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వర్షపాతం తక్కువుగా ఉండడంతో వివిధ రిజర్వాయర్లలో నీరు తక్కువుగా ఉండడం వల్ల కరువు మండలాల్లో ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరాను అందించినట్లుగా పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయశాఖ, జిల్లా పశుసంవర్ధకశాఖ, జిల్లా ఉద్యానవనశాఖ, డ్వామా, గ్రామీణ నీటిసరఫరా శాఖ తదితర శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన వివిధ విషయాలపై కేంద్ర బృందానికి వివరించారు. జిల్లాలో 30మండలాలకు గానూ 19మండలాలు అత్యంత తీవ్రమైన కరువును ఎదుర్కొన్నాయని వివిధశాఖల జిల్లా అధికారులు అందించిన నివేధికల మేరకు కరువు మండలాలకు కేంద్ర ప్రభుత్వం సాయం చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వ బృందాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలి

బద్వేల్ అర్బన్, జనవరి 8 ప్రభాతవార్త

బద్వేల్ ఆపుస్మా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం 10వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి అవగాహన సదస్సును కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని బుధవారం శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్ ఆవరణం నందు నిర్వహించ బడినది. ఈ కార్యక్రమానికి మోటివేషనల్ స్పీకర్ పోకల సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలకు సంబంధించి ఎలాంటి భయాందోళనలతో గురికావద్దని, ఏమైనా సందేహాలు అంటే ఆయా తరగతుల ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవచ్చు అన్నారు. విద్యార్థినీ,విద్యార్థులు మొదటి సారిగా మారిన సిలబస్ ప్రకారం పబ్లిక్ పరీక్షలు వ్రాయ బోతున్నారనీ,వారిని పరీక్షలకు సమాయత్త పరచుట ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ సదవకాశంను 300 మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల సిబ్బంది, కరెస్పాండెంట్లు పాల్గొన్నారు



## అక్రమ కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించుకొండి

బద్వేలు అర్బన్, జనవరి 8(ప్రభాత వార్త):



ప్రజలు వారి ఇంటి పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు అక్రమ కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించు కోవాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని రఘునాథపురం, హరిజనవాడలో ఆయన తన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతు అక్రమంగా కుళాయి కనెక్షన్లను కలిగి వున్నవారు వెంటనే వాటిని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లేని పక్షంలో వాటిని తొలగిస్తామన్నారు. కుళాయి కనెక్షన్లను పొందేందుకు డిపాజిట్ అమోంట్ రెండు విడతల్లో చెల్లించే వెసలుబాటును పురపాలక సంఘం కల్పించిందన్నారు. పన్ను బకాయిలు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. అదేవిధంగా నీటిసరఫరా,వీధి లైట్ల నిర్వహణను సక్రమంగా పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. అపరిశుభ్రంగా వున్న ఖాళీ స్థలాలు తక్షణమే శుభ్రపరచుకొని పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ స్థానికులకు సూచించారు.నీటిని వృధా చేయకుండా అవసరం మేరకు పొదుపుగా వాడుకోవాలని స్థానికులకు విజ్ఞప్తి చేశారు. తరుచుగా క్లోరిన్ టెస్ట్ చేసి ఎప్పటికప్పుడు రికార్డు చేస్తూ వుండాలని సిబ్బందికి సూచించారు.ఇల్లులేని అర్హులైన లబ్ధిదారులు వుంటే రెండవ విడత పిఎంఎవైలో నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు ప్లాన్ అప్రూవల్ అయిన తర్వాత ఇండ్లు కట్టుకుంటే సమస్యలు ఉండవని తెలిపారు పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ తోడ్పడవలసినదిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమములో మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ పి.మహేష్, మరియు ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళ పార్థివ దేహానికి శ్రద్ధాంజలి

**సిద్దవటం, జనవరి 8, ప్రభాతవార్త:**



సిద్దవటం మండలంలోని మాధవరం-1 గ్రామం ఎస్.కె.ఆర్.నగర్ గ్రామ నివాసి టీడీపీ నేత నరసింహ సతీమణి అనూష మంగళవారం కడప రిమ్స్ వైద్యశాలలో ప్రసవ ఇబ్బందితో మృతి చెందింది. ఈ విషయాన్ని తెలుసుకున్న జనసేన పార్టీ నేత కృష్ణ బుధవారం వారి స్వగృహానికి వెళ్లి శ్రద్దాంజలి ఘటించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసింహ సతీమణి అనూష చనిపోవడం చాలా బాధాకరమని వారి కుటుంబానికి ఎల్లవేళలా అన్ని విషయాల్లో తోడ్పడతానని వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు

**దువ్వూరు, జనవరి 08, ప్రభాతవార్త:**



మండలంలోని 18రెవెన్యూ గ్రామాలలో బుధవారం చింతకుంటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుతో ముగిశాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇక్బాల్ బాష మాట్లాడుతూ 18రెవెన్యూ సదస్సులలో ఎక్కువగా రైతుల నుండి భూ సమస్యలపై ధరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చింతకుంట, గుడిపాడు గ్రామలలో ఎక్కువ భూ సమస్యలు ఉన్నట్లు గుర్తించామని అన్నారు. గుడిపాడులో 30, చింతకుంటలో 35 ధరఖాస్తులు వచ్చాయన్నారు. అన్ని ధరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నామని వాటిని తగిన పరిష్కారం తెలియజేస్తామన్నారు. ఈ సదస్సులో డిప్యూటి తహసీల్దార్ కరీముల్లా, సర్వేయర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**కడప కార్పొరేషన్, జనవరి 8 ప్రభాతవార్త:**



పెళ్లిళ్ల ఆర్థిక సహాయం, అనారోగ్య బారిన పడినవారికి వైద్య ఖర్చులు, అవసరమైన వారికి రక్తదానం, అన్నదానం వంటి సేవ కార్యక్రమాలు జి.ఎం.ఆర్ ఎంప్లాయిడ్ ఓల్డ్ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా చేయడం గొప్ప విషయమని బిజెపి జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్ రెడ్డి అన్నారు. బుధవారం కడప బిజెపి కార్యాలయంలో జి.ఎం.ఆర్ ఎంప్లాయిడ్ ఓల్డ్ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అక్కడ చదివిన పూర్వ విద్యార్థులు అందరూ కలిసి పేద విద్యార్థులకు కోసం ఆర్థిక, ఆరోగ్యకరమైన సమస్యల పరిష్కారం కోసం కోసం పలుసేవ కార్యక్రమాలు చేపట్టడం అదిరిందినిమన్నారు. కార్యక్రమంలో జి.ఎం.ఆర్ ఎంప్లాయిడ్ ఓల్డ్ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు రాజారావు, కన్వీనర్ నిత్య, కో కన్వీనర్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగేశ్వర్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు గ్రైండర్ పంపిణీ

**అట్లూరు జనవరి 8 ప్రభాతవార్త :**



కీర్తిశేషులు పళ్లెం రామలక్ష్మమ్మ కర్మంతరం సందర్భంగా సిద్ధవటం పెన్నా నది ఒడ్డున యాకనాపురం కడప సిద్ధవటం ప్రధానరహదారీ వద్ద శ్రీ పరమాత్మ సేవా సమితి ఆశ్రమమునకు గ్రైండర్ మరియు వృద్ధులకు వృద్ధాశ్రమంలో అన్నదానం పంపిణీ చేసినట్లు కువైట్ ఎన్నారై పళ్లెం నర్సా రెడ్డి, తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ ఏపిఎండిసి డైరెక్టర్ ముడమాల.బాల ముని రెడ్డి, వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షులు ముడమాల.ప్రభాకర్ రెడ్డి, వేములూరు సర్పంచ్ ముడమాల గోవర్ధన్ రెడ్డి, దున్నుతుల బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ పళ్లెం నర్సా రెడ్డి, వెంకట నర్సా రెడ్డిలు తన తల్లి జ్ఞాపకార్థం ఇటువంటి సామాజిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు.

## ముందస్తు సంక్రాంతి సంబరాలు

**చిట్వేలి, జనవరి 8,ప్రభాత వార్త:**



పాత చిట్వేలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ప్రధానోపాధ్యాయులు కామాటం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. భోగి మంటలను, గొబ్బెమ్మలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లుల పోటీలు నిర్వహించి పిల్లలకు బహుమతులను ప్రధానం చేశారు. హెచ్ఎం కామాటం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హిందువుల అతి పెద్ద పండుగ సంక్రాంతి గొప్పతనాన్ని భావితరాలకు తెలపడం మన బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సహోపాధ్యాయుడు శివ నారాయణ రెడ్డి, అంగన్వాడి కార్యకర్త రాధా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డైరీ ఆవిష్కరణ

**వాల్మీకిపురం, జనవరి 8 ప్రభాతవార్త ః**

బుధవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం 2025 సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచారంలో విశ్రాంత ఉద్యోగుల సమస్యలు తదితర వాటిపై చర్చించారు. అందరూ కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సమిష్టిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సబ్ ట్రెజరీ అధికారి వేణుగోపాల్, రాంబాబు, విశాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకరయ్య, గౌరవ అధ్యక్ష లు బీవీ రమణ, ఉపాధ్యక్షుడు శంకర్రెడ్డి, నజీబ్సా హెబ్, సెక్రటరీ రామ్మూర్తినాయుడు, తదితర సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఈఓపై తగిన చర్యలు తీసుకోవాలి

**పీలేరు జనవరి 08 ప్రభాతవార్త ః**



గ్రామ పంచాయతి కంప్యూటర్ ఆపరేటర్‌పై దాడికి పాల్పడిన ఈఓ గురు మోహన్ పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, వార్డు సభ్యులు ఇంచార్జ్ ఎంపీడీఓ లతీఫ్ ఖాన్‌కు వినతి పత్రం సమర్పించారు. బుధవారం వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంచార్జ్ ఎంపీడీఓను కలసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పీలేరు పంచాయతీ ఈఓగా గురుమోహన్ బాధ్యతలు చేపట్టినప్పటినుంచి పంచాయతీ సిబ్బందితో పాటు ప్రజలు కూడా నిరసన పడుతున్నట్లు చెప్పారు. ఈఓ చేసిన ఈ దాడిని పీలేరు మేజర్ పంచాయతీ బోర్డు సర్పంచ్, సభ్యులమైన తాము దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కావున, ఎంపీడీఓ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

**తొండూరు, జనవరి 8, ప్రభాతవార్త :**



మండలంలోని సైదాపురం గ్రామం సమీపంలో ఫోన్‌లో మాట్లాడుతూ వెళుతున్న క్రమంలో స్కూటర్ అదుపు తప్పి క్రింద పడిన ప్రమాదంలో స్కూటరిస్టు అక్కడికి అక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. తొండూరు నుంచి సైదాపురంకు మధ్యాహ్నం భోజనం సమయం కావడంతో స్కూటీ లో వెళుతున్న కె .శ్రీనివాసులు అదుపుతప్పి కిందపడ్డాడు దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు వివరించారు. ఈయన తొండూరు ఎంపీడీవో కార్యాలయ సిబ్బందిగా పనిచేస్తున్నాడు.

## రెవెన్యూ సదస్సులో 751 అర్జీలు స్వీకరణ

**పీలేరు జనవరి 08 ప్రభాతవార్త ః**

మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 751 అర్జీలు ప్రజల నుంచి రైతుల నుంచి స్వీకరించామని తెలిపారు అందులో 106 అర్జీలను పరిష్కరించామని మిగిలిన అర్జీలను గడువులో పరిష్కరిస్తామని స్పెషల్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ రమా అన్నారు. అలాగే బుధవారం కావలపల్లి పంచాయతీ ఒంటిల్లు లో జరిగిన రెవెన్యూ సదస్సులో 28 అర్జీలు వచ్చాయి .ఈ కార్యక్రమంలో తహసిల్దార్ భీమేశ్వరరావు, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్వో వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

## ట్రిబుల్ ఐటీలో విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

**వేంపల్లి, జనవరి 8, ప్రభాతవార్త :**



ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిబుల్ ఐటీలో చదువుతున్న ఈ4 విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు డైరెక్టర్ ఏవీఎస్. కుమారస్వామి గుప్తా తెలిపారు. బుధవారం వివిధ ప్రతిష్టాత్మకమైన కంపెనీలు నిర్వహించిన ప్లేస్ మెంట్ ఇంటర్వ్యూలలో తమ విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచి 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. అందులో ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు యూప్ టివి కంపెనీ, ఎవరెస్ట్ ఇంజనీరింగ్ కంపెనీ, వే టు న్యూస్ కంపెనీలలో వార్షిక వేతనం రూ.5లక్షల నుండి రూ 7 లక్షల వరకు వేతనాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రముఖ కంపెనీలకు ఎంపిక కావడం పట్ల డైరెక్టర్ తో పాటు, పరిపాలన అధికారి రవికుమార్, ప్లేస్ మెంట్ కోఆర్డినేటర్ వినోద్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ సుందర్, తదితరులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు మరిన్ని విజయాలు పొంది భవిష్యత్తు విద్యార్థులకు మార్గదర్శకాలుగా కావాలని ఆకాంక్షించారు.

## రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపిస్తున్న ఎన్డీయే ప్రభుత్వం

**వేంపల్లి, జనవరి 8, ప్రభాతవార్త :**



దేశ తూర్పు తీరానికి ప్రగతి హారాల్ల బాసిల్లే భారీ ప్రాజెక్టులు రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా శ్రీకారం చుట్టి ప్రధాని నరేంద్ర మోడీ సమక్షంలో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయడం సంతోషకర విషయమని జనసేన నేత డాక్టర్ దాసరి రవిశంకర్ అన్నారు. వేంపల్లిలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కలిసి విశాఖలో రోడ్‌షో నిర్వహించి, భారీ బహిరంగ సభ నిర్వహించారన్నారు. పూరి మడక దగ్గర ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ కి రూ.1.85లక్షల కోట్లు విడుదల చేశారని, , అదేవిధంగా విశాఖ దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి రూ.149 కోట్లు, రోడ్ల నిర్మాణం విస్తీర్ణంకురూ. 4,593 కోట్లు ,రైల్వే ప్రాజెక్టులు రూ.6,028 కోట్లు, నక్కపల్లి దగ్గర బల్క్ డ్రగ్ పార్కుకి రూ.1,877 కోట్లు, 234. 28 కిలోమీటర్ల రోడ్లకి రూ.3,044 కోట్లు,323 కిలోమీటర్ల మూడు రైల్వే లైన్ల పనులకు రూ 5,718 కోట్ల రూపాయల పనులను మంజూరు చేసి జాతికి అంకితం చేశారని, ప్రధాని నరేంద్ర మోడీ ఇలాంటి అభివృద్ధి పనులను మరిన్ని చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానం వచ్చేలాగా చేయాలని డాక్టర్ దాసరి శంకర్ ఆకాంక్షించారు.

## ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన స్వామి వారి ఆలయం

**సుండుపల్లి,జనవరి08,ప్రభాతవార్త:**

మండలంలోని ముడుంపాడు గ్రామం ఆరోగ్యపురంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ అర్చకుడు అమ్మునాయక్ మాట్లాడుతు 10 వ తేది అనగ శుక్రవారం ముక్కోటి ఏకాదశి శుభ సందర్భంగా ఉత్తర ద్వార ముఖంగా స్వామి వారు వెలసి ఉన్నారు ఆయన దర్శనం కోసం వచ్చే భక్తులందరికి తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ ఉత్తర ముఖ ద్వారంలో వెలసిన శ్రీ పసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకొన్న భక్తులందరికి చేసుకన్న భక్తులందరికి స్వామి వారి కృప ఉంటుందని తెలిపారు. కనుక భక్తులందరు 10 వ తేది శుక్రవారం ఉదయం 6 గం నుండి స్వామి వారి దర్శనం కలిగిస్తామని ఈ అవకాశం భక్తులందరు సద్వినియోగం చేసుకోలాన్నారు.

## శాస్త్రవేత్తలను స్మరించుకుందాం

**వేంపల్లి, జనవరి 8, ప్రభాతవార్త :**

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నారాయణ రెసిడెన్షియల్ స్కూల్ వేంపల్లిలో శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ జయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు పొన్నతోట గంగాధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాల బయన్నలు మాట్లాడుతూ స్టీఫెన్ విలియం హాకింగ్ విశ్వ నిర్మాణ శాస్త్రవేత్త (బ్లాక్ హోల్స్ కృష్ణబిలాలకు) సంబంధించి అనేక అంశాలకు సంబంధించి పరిశోధనలు చేశారని తెలిపారు. స్కూలు కరస్పాండెంట్ నారాయణరెడ్డి ప్రిన్సిపల్ మహాలక్ష్మిలు మాట్లాడుతూ ఈయన ఈయనకు సోకిన వ్యాధి వల్ల రెండు సంవత్సరాల కంటే ఎక్కువ బ్రతకరని డాక్టర్లు చెప్పినప్పటికీ 50 సంవత్సరాలు పైబడి ఆయన బతికాడు ఆయన దూత సంకల్పం విశ్వ రహస్యాలు తెలుసుకునేందుకు ఆయన అనేక పరిశోధనలు చేశారన్నారు మరణించే సమయానికి ఆయన క్రైమ్ బ్రిడ్జి విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ కాస్మాలజీ రీసెర్చ్ డైరెక్టర్‌గా పనిచేశారన్నారు నిర్మాణ శాస్త్రవేత్తగా ఆయన ఖ్యాతినిందారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందితో పాటు విద్యార్థి విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైభవంగా రామకోటి

**రామసముద్రం, జనవరి 8 ప్రభాతవార్త :**

మండలం మూగవాడి పంచాయితీ గుండ్లపల్లె గ్రామంలోని రామాలయంలో బుధవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వైభంగా రామకోటి నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు భక్తులు భక్తిశ్రద్దలతో రామనామ జపం చేస్తారు.

## ఎమ్మెల్యే చొరవతో మంచినీటి సమస్య పరిష్కారం

**కలికిరి, జనవరి 8, ప్రభాతవార్త:**



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ పాత హరిజనవాడలో పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చొరవతో గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారం అయ్యింది. గ్రామంలో 300 కుటుంబాలు జీవిస్తున్నాయి. గ్రామంలోని రక్షిత మంచినీటి బోరులో నీటి శాతం తగ్గడంతో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో రక్షిత మంచినీటి బోరు వేసేందుకు నిధులు మంజూరు చేయించారు. సర్పంచ్, గ్రామస్థులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రికుంటపల్లె పంచాయతీ తెదేపా అధ్యక్షులు వాసనూరి వెంకటపతి, తెదేపా నాయకులు కొటాల చల్లయ్య, ఉంబాల రెడ్డయ్య, పంచాయతీ వార్డు మెంబర్ ఎ.శంకరయ్య, తెదేపా నాయకులు శ్రీనివాసులు, వెంకటరమణ, కె.రఘు, గంగాధర్, పి.సుధాకర్, సి.సురేష్‌కుమార్, ఎ.వెంకటరమణ, మణికుమార్, గురుప్రసాద్, యువ నాయకులు సాయిచంద్, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానికేతరుల భూములను రద్దు చేయాలి

**కాశినాయన, జనవరి 8, ప్రభాత వార్త**

మండలంలోని సావిశెట్టిపల్లి గ్రామంలోని నిర్వహించిన రెవెన్యూ సదస్సులో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, సిపిఎం మండల కార్యదర్శి యంబడి పోలయ్య ఆధ్వర్యంలో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు వందల ఎకరాల ప్రభుత్వ పట్టా భూములను నకిలీ పత్రాలతో ఆక్రమించారని వారిపై చర్యలు తీసుకొని ఆ భూములను రద్దు చేయాలని తహసిల్దార్ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు.. గతంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు కబ్జా జరిగిన వివరాలను అందించామని మండల స్థాయి అధికారులకు విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ మండల స్థాయి అధికారులు మాత్రం నీరు గారుస్తున్నారని వారు ఆరోపించారు.. పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు సాగు చేస్తున్న భూములను అక్రమంగా ఆన్లైన్లో నమోదు చేశారని వాడికి తొలగించి సాగు చేస్తున్న వారి పేర్లపై నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు చేపట్టకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారి హెచ్చరించారు.

## కలికిరిలో ఐసీఏఆర్ క్యూఆర్‌టీ బృందం పర్యటన

**కలికిరి, జనవరి 8, ప్రభాతవార్త:**



కలికిరిలోని కేవీకేని బుధవారం భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) నుంచి ఆరు మంది శాస్త్రవేత్తలతో కూడిన క్యూఆర్టీ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డా.కె.మంజుల బృందానికి అధ్యక్షులైన డా.ఎస్.కె.చక్రవర్తికి బృంద సభ్యులకు స్వాగతం పలుకుతూ డా.కె.వి.రాఘవేంద్ర ఎన్ఆర్ఐపీఎం కీటక శాస్త్రవేత్త సహకారంతో టమాటో పంటలలో ముఖ్యమైన చీడపీడలను కాలుష్య రహిత పద్ధతుల ద్వారా నివారించే ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం బృంద అధ్యక్షుడు మరియు సభ్యులైన డా.చక్రవర్తి, డా.సింగ్, మహేందర్‌సింగ్, డీపీక్యూఎస్ రీజనల్ సెంటర్ బెంగళూరు, విజయవాడ నుంచి పాల్గొన్న శాస్త్రవేత్తలు సిద్దికి, డా.జి.టీ జయసింహ, డా.సురేష్, కేవీకే శాస్త్రవేత్తలు ఈ అంశంపై చర్చించారు. టమోటటా పంటలో సూది పురుగు అమెరికన్ తెల్ల దోమ తదితర తెగుళ్ల నివారణోపాయాలు వివరించారు. బంతి పంటను ఎరపంటగా వేయడం జీవ సిలీంద్ర నాశనం లైన ట్రైకోడెర్మా సూడోమోనాస్లను డ్రిప్ ద్వారా పంటకు అందించడం తదితర విషయాలు తెలిపారు. ఈసందర్భంగా కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డా.పీరూసాహెబ్ శాస్త్రవేత్తలు అందరి తరుపున రైతులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త డా.మంజుల, ఆఫీస్ సూపరింటెండెంట్ రుక్మిణి, శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వంతాటిపల్లెలో పొలం పిలుస్తోంది

**సిద్దవటం, జనవరి 8, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలంలోని ఎస్.రాజంపేట వంతాటిపల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి ప్రస్తుతం రైతులు రబీ సీజన్‌లో వరి సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా బుధవారం వ్యవసాయ సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ మండలంలో వరి సాగు రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారని 10 రైతు సేవా కేంద్రాలలో నీమ్‌కోటెడ్ గ్రానులర్ యూరియా ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులు ఎక్కువగా ఆర్ఎస్ఆర్ 15048 అనే రకాన్ని సాగు చేస్తున్నారని యూరియా ఎరువుతో పాటు 25 కిలోల పొటాష్ వాడడం చాలా ముఖ్యమని రైతులకు ఆయన తెలిపారు. పొటాష్ వాడడం వల్ల గింజ నాణ్యత పెరుగుతుందని అధిక దిగుబడి రైతులకు లాభసాటిగా వస్తుందన్నారు. రబీ కాండం తొలిచ, పురుగుపట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సహాయకులు మేకల ప్రేమ్‌కుమార్, శ్రీనాథ్, శివకుమార్ రైతులు పాల్గొన్నారు.

## మండలంలో రెవెన్యూ సదస్సులు విజయవంతం

**కలికిరి, జనవరి 8, ప్రభాతవార్త:**



మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో గత నెల నుంచి ఈ నెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరిగినట్లు తహసీల్దార్ మహేశ్వరీబాయ్ తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో జరిగిన రెవెన్యూ సదస్సులలో 474 రెవెన్యూ సమస్యలపై అర్జీలు రావడం జరిగింది. వాటిలో ఇది వరకే 150 అర్జీలను పీలేరు ఎమ్మెల్యే సహకారంతో సమస్యలు పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపారు. మరికొన్ని సమస్యలను అతి త్వరలోనే గ్రామాల్లో పర్యటించి ప్రజల సమక్షంలో పరిష్కరిస్తామన్నారు. బుధవారం గుట్టపాలెం పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో 26 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులలో కలికిరి మండలం నోడల్ అధికారిగా జయప్రకాష్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కలికిరి మండలం సర్వేయర్ రెడ్డప్ప, వీఆర్వోలు సురేష్‌కుమార్‌రెడ్డి, నరేష్‌కుమార్, గౌరీ, శిల్పకుమారి, రెడ్డిరాణి, ఆదిలక్ష్మి, ప్రసాద్‌రెడ్డి, సుల్తాన్, నరేంద్రకుమార్‌రెడ్డి, దశరథ, ఫారెస్టు అధికారులు, ఎండోమెంట్ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆదాయ పన్నుపై అధికారులు అవగాహన సదస్సు

**మదనపల్లె, జనవరి 8 ప్రభాతవార్త :**




ఆదాయ పన్నులకు సంబందించి బుధవారం పట్టణంలోని రోటరీక్లబ్ నందు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదాయపన్ను శాఖ అధికారి వంశీధర్ మాట్లాడుతూ వ్యాపారస్తులు సకాలంలో ప్రభుత్వానికి ఆదాయ పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆదాయ పన్నులు చెల్లించకపోతే చట్టరిత్యా నేరం అన్నారు. ప్రతి ఒక్కరూ ఆదాయ పన్నుల గురించి అవగాహన పొంది సహకరించాలన్నారు. తమ ఆడిట్ల ద్వారా వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, వివిధ రకాలుగా ఆదాయం పొందే వారందరూ సకాలంలో పన్నులు చెల్లించాలన్నారు. ఆదాయ పన్నుల రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదాయపన్నుల అధికారి మహమ్మద్ ఫరూక్, రోటరీక్లబ్ అధ్యక్షులు చైతన్య, సీనియర్ సిటిజన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముని గోపాలక్రిష్ణ, జగన్‌మోహన్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సూక్ష్మ చిన్న మధ్యతరహ అవాస సంస్థల విశ్వం

**కురబలకోట, జనవరి 8 ప్రభాతవార్త :**



కేంద్ర ప్రభుత్వం విశ్వం ఇంజనీరింగ్ విద్యాసంస్థలను సూక్ష్మ చిన్న, మధ్యతరహా ఆవాస సంస్థగా గుర్తించిందని విద్యాసంస్థల అధినేత ఎం.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మినిస్ట్రిఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్ ప్రభుత్వానికి చెందిన విశ్వం ఇంజనీరింగ్ కాలేజ్‌ను ఇన్నోవేటివ్ స్కీమ్, ఎంఎంఈ చాంపియన్ స్కీమ్ పరిధిలో అవాస సంస్థగా గుర్తించింది. ఈ ఇన్స్యూట్‌లో పోస్టు ఇన్స్యూట్ అనేక రంగాల నుంచి అడ్వాన్స్ ఆవిష్కరణలో ఆలోచనలు,అన్వేసించవచ్చున్నారు. ఇది ఉత్పాదకుల లేదా విద్యార్థులు కావచ్చునన్నారు.

## సింగిల్‌విండో త్రీమెన్ కమిటీకి ఆశావహులు

**కురబలకోట, జనవరి 8 ప్రభాతవార్త :**

సింగిల్‌విండో త్రీమెన్ కమిటీకి ఆశావహుల పేర్లను పార్టీ అధిష్టానానికి పంపేందుకు బుధవారం కురబలకోట మండలం అంగళ్ళులో కూటమి నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఏకైక సింగిల్‌విండో త్రీమెన్ కమిటీకి తమ పేర్లను ప్రతిపాదించి ఖరారు చేయాలంటూ పలువురు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు ఈసమావేశంలో కోరారు. మండలంలోని టిడిపి నాయకులు పి.సురేంద్రయాదవ్, మండల కన్వీనర్ వైజి.సురేంద్ర, మాజీ కన్వీనర్ జంగా రాఘవరెడ్డి, రంగారెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి, లక్ష్మన్న, విశ్వనాథ్, రాజారెడ్డి, బావాజాన్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రేషన్ షాపులకు 22 ధరఖాస్తులు

**దువ్వూరు, జనవరి 08, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని 18 చౌకదుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా చివరి రోజైన బుధవారం 22ధరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ ఇక్బాల్ బాష తెలిపారు. 22ధరఖాస్తులలో చింతకుంట, గుడిపాడు, పెద్దజొన్నవరం గ్రామాలకు రెండు రెండు ధరఖాస్తులు వచ్చాయన్నారు. మిగతా 15చౌక దుకాణాలకు ఒక్కొక్క ధరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. వీటిన్నింటిని పరిశీలించి జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయానికి పంపుతున్నట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదిన అభ్యర్థులకు రాత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

## ప్రభుత్వస్థలంలో నిర్మిస్తున్న చర్చిని నిలిపివేసిన తహశిల్దార్



**గుర్రంకొండ, జనవరి 8, ప్రభాతవార్త**

ప్రభుత్వ స్థలంతోపాటు పసలమంద నిర్వహిస్తున్న స్థలంలో చర్చి నిర్మాణ పనులను తహశిల్దార్ శ్రీనివాసులు నిలుపుదల చేశారు. బుధవారం మండలంలోని గుర్రంకొండగ్రామం తలారివాండ్లపల్లికి చెందిన సర్వేనెంబర్ 617, 1లో, మరియు 617, 12లో, వున్నటువంటి భూములలో పెద్దల కాలం నుండీ చర్చినిర్మిస్తున్న స్థలంలో పూర్వీకుల నుండీ సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించే స్థలంలో నిర్మిస్తున్నందున గ్రామస్థులందరూ మూకుమ్మడిగా ఫిర్యాధు చేయడంతో తహశిల్దార్ శ్రీనివాసులు నిలుపుదల చేశారు. పసలమందను సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించే స్థలాన్ని ఉత్సవాలకే వుపయోగించేలా ఆదేశాలు ఇవ్వాలని గ్రామస్థులు పట్టుబడ్డారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తి చర్చి నిర్మాణ పనులను నిర్వహించే వ్యక్తికి నిర్మాణ పనులు చేపట్టరాదని తహశిల్ధారన సూచించారు.

## చిరుత సంచారంపై గ్రామస్థులు భయాందోళనలు

**రామసముద్రం, జనవరి 8 ప్రభాతవార్త :**

మండలంలోని కుర్రపల్లె, యంబాడి గ్రామాల పొలిమేరలో చిరుత సంచరిస్తున్నట్లు రైతులు తెలిపారు. బుధవారం యంబాడి గ్రామ సమీపంలోని చెరువువద్ద చిరుత సంచరిస్తున్నట్లు కనుగొన్న గ్రామస్థులు చిరుత జాడకోసం వెతికారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో పాటు చితరు కోసం వెతికారు. చిరుత సంచరిస్తున్నట్లు పాదముద్రులు ఉన్నాయని చిట్టిబాబు తెలిపారు. దీంతో రైతులు, గ్రామస్థులు పొలాల వద్దకు వెళ్ళాలంటే భయపడుతున్నామని తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం తహశీల్దార్



**రామసముద్రం, జనవరి 8 ప్రభాతవార్త :**

రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలు పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్యలు పరిష్కారంకు చర్యలు తీసుకొంటామని తహశీల్దార్ నిర్మాలాదేవి తెలిపారు. ఇప్పటి వరకు 18 అర్జీలు వచ్చాయని వీటిని త్వరగా పరిష్కారం చేస్తామన్నారు. బుధవారం మండలంలోని కురిజల గ్రామ పంచాయితీలో సర్పంచ్ మంగమ్మ అధ్యక్షతన రెవెన్యూసదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్, ఆర్ఐ, విఆర్ఓ, విఆర్ఏలు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులను తమ ఘనతని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం



**కమలాపురం, జనవరి 8, ప్రభాతవార్త:**

వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులను తమ ఘనత అని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని కడప జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కమలాపురం వైసీపీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో ఉత్తరాంధ్రకు ఒరిగిందేమీ లేదన్నారు. వైసీపీ హయాంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను ఆయన గుర్తు చేశారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, ఎన్టిపిస్, గ్రీన్ హైడ్రోజన్ హబ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు జగన్ హయాంలో జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాలెం సుబ్బారెడ్డి, తురకపల్లి రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్లు, మరుజోళ్ల శ్రీనివాసరెడ్డి, సాదిక్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, చవ్వా రెడ్డి గంగాధర్‌రెడ్డి, రాజుపాలెం జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్ యాదవ్ ఖాదర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

**కమలాపురం, జనవరి 8, ప్రభాతవార్త:**



కడప జిల్లా ఎస్పీ విద్యా సాగర్ నాయుడు, ఎస్డీపీఓ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అంతర్ జిల్లా దొంగ అరెస్టు చేసినట్లు సీఐ రోషన్, ఎస్సై ప్రతాప్‌రెడ్డిలు బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూకట్లపల్లి భరత్‌కుమార్(19) తండ్రి బ్రహ్మయ్య తుడుమలదిన్నె గ్రామం, ఖాజీపేట మండలంగా గుర్తించారు. ఇతను నుంచి 3 బైకులు స్వాధీనం చేసుకున్నామని వారు తెలిపారు. ఇతను కమలాపురం మండలం ఖాజీపేటకు పోయే రోడ్డులో ఉన్న పాగేరు వంతెన వద్ద మధ్యాహ్నం ఒంటిగంటకు అరెస్టు చేశామని తెలిపారు. అరెస్టు అయిన ముద్దాయి చిన్నప్పటి నుంచి చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బు కోసం బైకు దొంగతనాలకు పాల్పడుతూ దొంగలించిన బైకులను అమ్ముకుంటూ అదే క్రమంలో గతంలో దొంగతనం చేసిన బైకులను అమ్మే క్రమంలో పట్టుబడ్డాడు. ఈ ముద్దాయి పైన ఇది వరకే పోలీసు స్టేషన్‌లో కేసులు ఉన్నట్లు గుర్తించారు. అలాగే అతని దగ్గర నుంచి 3 బైకులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలిస్తున్నామని సీఐ, ఎస్సైలు తెలిపారు. ముద్దాయి అరెస్టుకు సహకరించిన పోలీసు సిబ్బందిని సీఐ, ఎస్సైలు అభినందించారు.

## దర్శన ఏర్పాట్లను పరిశీలించిన పుత్తా

**కమలాపురం, జనవరి 8, ప్రభాతవార్త:**



కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని రైల్వే గేటు వద్ద వెలసిన శ్రీ రాధాకృష్ణ మందిరంలో 10వ తేదీ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లను తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి పరిశీలించారు. బుధవారం ఆయన శ్రీరాధాకృష్ణ ఆలయాన్ని దర్శించి అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. అక్కడ పనిచేస్తున్న వారికి సూచనలను సలహాలు ఇచ్చారు. భక్తులందరూ వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకొని, ఆ దేవుడి కృపకు పాత్రులు కాగలరని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపురం మండల తెదేపా నాయకులు వాసుదేవరెడ్డి, ఖాదర్‌బాషా, రాఘవరెడ్డి, కంకర సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దాది రామయ్య, చిన్న సుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డి, గుజ్జుల నారాయణ, నరసింహ ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డాక్యుమెంట్ పోయినది

కదిరి జయరాం రెడ్డి తండ్రి కె నాగిరెడ్డి ఇం: 35/142 సుబ్బారెడ్డి కాలనీ, ఎస్ఎన్ కాలనీ, రాయచోటి టౌన్ మరియు (మం) అన్నమయ్య జిల్లా, ఏ.పీ., నా ఒరిజినల్ రిజిస్టర్ డాక్యుమెంట్ పోయినది 1351/1995 దొరికిన వారు పై అడ్రస్ కు తెలియజేయగలరు.

## సాగునీటితో జిల్లాను సస్యశ్యామలము చేస్తాం



రాయచోటి జనవరి 8 ప్రభాతవార్త

నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సాగునీటిని అందించి సస్యశ్యామలం చేయడమే ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రసాద్ అన్నారు. ఈ జిల్లా మహాసభకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి ప్రసాద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు ఆహ్వానించడం జరిగింది. ఈ జిల్లా మహాసభ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వంగమల రంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు శివరామకృష్ణదేవరా అధ్యక్షతన ఈ మహాసభ జయప్రదం చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి సమస్యలను తెలుసుకొని ఆయన ప్రాజెక్టులపై ఉన్న సమస్యలను ఏదైతే హంద్రీనీవా నుండి వెలుగల్లుకు నీరు వదలాలని వెల్లగల్లు నుండి చిన్న కాలువలు మరియు పెద్ద కాలువలు పూర్తి చేసి ఆ కాలువలకు నీరు వదిలితే చెరువులకు మరియు బోర్లకు నీరు అందుబాటులో ఉంటే రైతు అనే వాళ్ళు రాయచోటి నియోజకవర్గం 6 మండలాల్లో ఉన్నటువంటి రైతులు అందరూ కూడా పంటలు పండించుకుంటారని ఆయన ఈ సభ ముఖంగా తెలియజేయడం జరిగింది. తర్వాత రాష్ట్ర ఉపాధ్యక్షులు రామానాయుడు మాట్లాడుతూ పీలేరు చిన్నమండెం మదనపల్లి గుర్రంకొండ చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్నటువంటి టమోటా రైతులు టమోటా ఎక్కువ మతంలో పండిస్తున్న పంటకు గిట్టుబాటు ధర అనేది కల్పించాలని ఆయన డిమాండ్ చేయడం జరిగింది. ఈ సభాముఖంగా ఈ మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడుతూ రాయచోటి కూరగాయల మార్కెట్లో రాత్రి ఒంటిగంట సమయంలో వేలంపాట పాడడం జరుగుతుంది రైతు దగ్గర తక్కువ ధరకు కొని తర్వాత వాళ్ళు ఎక్కువ మొత్తంలో అమ్ముకోవడం జరుగుతుంది ఆయన ఈ సభలో తెలియజేయడం జరిగింది ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా సిపిఐ కార్యదర్శి పిఎల్ నరసింహులు డాక్టర్ మహేశ్వర్ రాజు అలాగే అర్చన విద్యాసంస్థలు మదన్ మోహన్ రెడ్డి రాయచోటి ఏరియా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి అధ్యక్షుడు హరినాథ రెడ్డి కార్యదర్శి కె వి ఎస్ నాయుడు గౌరవ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి గిరిజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ్ నాయక్ సిపిఐ సహాయ కార్యదర్శి మహేష్ సిపిఐ ఏరియా కార్యదర్శి సిద్ది గళ్ళ శ్రీనివాసులు పీలేరు సిపిఐ కార్యదర్శి వెంకటేష్ కోడూరు ఇంచార్జ్ జ్యోతి చిన్నయ్య ములకలచెరువు సీపీఐ ఇన్చార్జి అంజన్నప్ప కడప జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి మరి కొంతమంది రైతులు పాల్గొని ఈ జిల్లా రెండవ మహాసభను పెద్ద ఎత్తున జయప్రదం చేయడం జరిగింది.

## వర్మి కంపోస్ట్ ద్వారా ఎరువు తయారీ



తంబళ్లపల్లె జనవరి 8 ప్రభాతవార్త ః

మండలంలోని డంపింగ్ యార్డులలో వర్మీ కంపోస్ట్ (వానపాములు ఎరువు) తయారీకి శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని గోపిదిన్నె డంపింగ్ యార్డ్ లో వానపాముల పెంపకం ప్రక్రియను పరిశీలించారు. గ్రామాలలో సేకరించిన తడి పొడి చెత్త ను డంపింగ్ యార్డ్ లో చేర్చి ఎరువులు తయారు చేసి రైతులకు సరఫరా చేయడానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పంచాయతీల పరిధిలో పనిచేసే గ్రీన్ అంబాసిడర్లు ఈ వర్మి కంపోస్ట్ తయారీపై శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం గోపిదిన్నె కొటాల సచివాలయాలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాలలోని సమస్యలపై కార్యదర్శిలు, సచివాలయ సిబ్బంది పరిష్కారానికి ముందుండాలని ఆదేశించారు. ఆయన వెంట కార్యదర్శి సుబ్బారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా...

చిన్నమండెం జనవరి8 ప్రభాతవార్త:



మండలంలోని చాకిబండ గ్రామ కస్పాలో వెలసిన మహిమాన్వితుడు దశావతార వెంకటేశ్వర స్వామి కళ్యాణం 10 వ తేదీన అంగరంగ వైభవంగా మద్దిరాల బయారెడ్డి కుటుంబ సభ్యుల అధ్వర్యంలో జరగనున్నట్లు నిర్వాకులు తెలిపారు. ఈ ఉత్సవాలాలో బాగంగా స్వామివారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం రాత్రి కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంబమోతాయి. శుక్రవారం9.30గంటల నుండి స్వామివారికళ్యాణం కనువిందుగా వేద పండితుల మంత్రోచరణాల మధ్య వేలాది మంది భక్తుల వీక్షణాల మద్య అంగరంగ వైభవంగా జరగనుంది.ఆలాగే ఉత్తర ద్వారా దర్శనం వుంటుంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం వుంటుది. కావున ఈ ఉత్సవాలలోభక్తులు వేలాదిగాపాల్గొని వెంకటేశ్వరస్వామి కృపకు పాత్రులు కావాలని నిర్వాకులు కోరారు.

## నేటితో ముగిసిన రెవిన్యూ సదస్సులు

సుండుపల్లి, జనవరి08,ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవిన్యూ సదస్సులు నేటితో మిగితాయని మండల ప్రత్యేక అధికారి జయరాముడు అన్నారు. చివరి రోజు అయిన బుధవారం మండలంలోని అక్కంపల్లి గ్రామసదస్సు సుండుపల్లి మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు ప్రజలనుంచి సమస్యలు తో కూడుకొన్న అర్జీలు వచ్చాయని అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్న మాట్లాడుతు వచ్చిన అర్జీలు పరిశీలించి పరిష్కరిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జయరాముడు, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్న, మండలసర్వేయర్ వెంకటసుబ్బయ్య, విఆర్ఒ బసయ్య, సిబ్బంది ప్రజలు, పాల్గొన్నారు.

## 129 జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలి

యర్రగుంట్ల జనవరి 8 ప్రభాతవార్త

కార్మికులందరికి 129జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఆర్టీపీపీ చీఫ్ ఇంజనీర్ కి బుధవారం ఏఐటీయూసీ వినతి పత్రం అందించారు. 167 జీవో లో మిగిలి వున్నా కార్మికులందరికి 129 జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని ఇన్చార్జి చీఫ్ ఇంజనీర్ శ్రీ సోమశేఖర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఇంచార్జి చీఫ్ ఇంజనీర్ సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఏపీ జెన్కో 3.01.2025 వ తేదిన 167 జీవో రద్దుచేసి 129 జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలని మెమో ఇవ్వడం జరిగింది అన్నారు .మీరు ఇచ్చిన అర్జీని వేంటనే హెడ్ ఆఫీస్ కు పంపించి కార్మికులందరికి న్యాయం జరిగేందుకు కృషి చేస్తాను అన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్క్స్ యూనియన్ కాంట్రాక్ట్ లేబర్ వింగ్ జెన్కో రాష్ట్ర కార్యదర్శి నారుబోయిన రాము, ప్రాంతీయ అధ్యక్షకార్యదర్శులు వెన్నపూస సాంబశివరెడ్డి, నందం రాజేష్, దంతం దస్తగిరి, మహిళ కార్మికులు పాల్గొన్నారు.



## యూనియన్‌లో కార్మికులు చేరిక



యర్రగుంట్ల జనవరి 8 ప్రభాతవార్త

మండల పరిధిలోని ఆర్టీపీపి స్టేజ్ 4 యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ గత 8 సంవత్సరాలుగా నిర్మాణము నుంచి నిర్వహణ లో పనిచేస్తు చాలీచాలని జీతాలతో చాలా దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్న కార్మికులు గతంలో ఏ యూనియన్ లో లేకుండా రాజకీయ పార్టీల నాయకులు అన్నదండలతో చేరి వారి చెప్పినట్టు ఉంటూ వారి నుండి బయటికి రాలేక కనీస వేతనాలు నోచుకోకుండా చాలా ఇబ్బందులు గురవుతున్న ఈ నేపథ్యంలో గత సంఘటన ఆధారంగా ఏఐటీయూసీ అండగా నిలిచిందని యూనియన్ పై నమ్మకంతో 2025 జనవరి 8వ తారీఖున మధ్యాహ్నం ఒంటిగంట 30 నిమిషాలకు యూనియన్ లో 63 మంది చేరారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పొన్నా. శివయ్య. కార్మికులకు కండువా వేసి ఆహ్వానం పలికారు సభ్యత్వం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో కాంట్రాక్ట్ లేబర్ వింగ్ జెన్కో రాష్ట్ర కార్యదర్శి నారుబోయిన.రాము ప్రాంతీయ కార్యదర్శి సాంబశివారెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ శివన్న వైస్ ప్రెసిడెంట్ దస్తగిరి పాల్గొన్నారు.

## మున్సిపల్ విభాగం అధ్యక్షులుగా ఫయజూర్ రహ్మాన్, జిల్లా అధ్యక్షులుగా బేపారి మహమ్మద్ ఖాన్

రాయచోటి జనవరి 8 ప్రభాత వార్త

వైఎస్సార్ సిపి పార్టీలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరితో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామనీ మున్సిపల్ విభాగం అధ్యక్షులుగా మున్సిపల్ చైర్మన్ ఫయజూర్ రహ్మాన్,వైఎస్సార్ సిపి మైనార్టీ జిల్లా అధ్యక్షులుగా బేపారి మహమ్మద్ ఖాన్‌లు. ఎన్నికయ్యారు. ఈ సందర్బంగా వైస్ చైర్మన్ ఫయజూర్ రహ్మాన్ నివాసంలో వారు పత్రికా సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతు తమపై నమ్మకం ఉంచి ఈ పదవులు కేటాయించినందుకు రాబోవు ఈ ఇదేండ్లలో అన్ని విధాలుగా పార్టీ బలోపేతానికి ఆహర్నిసులు కృషి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో పార్టీ బలపడే విదంగా పని చేస్తామని వారు వివరించారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు



చిన్నమండెం జనవరి 8 ప్రభాతవార్త:

రెవెన్యూ పరంగా వున్న సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుదవారం బోనుమల సదస్సుతో ముగిసినట్లు త్గహసిల్దార్ నరసింహులు తెలిపారు. అందులో బాగంగా బోనుమల సచివాలయంలో రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో రెవెన్యూ పరంగా 8 అర్జీలు, అలాగే పింఛన్లు హౌసింగ్ రైస్ కార్డుల కొరకు కొన్ని దరకాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరకాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ చంద్రానాయక్ విఆర్ఓ రామయ్య, సర్వేయర్ శ్యామల సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## సంక్రాంతికి మధ్యంతర భృతిని ప్రకటించాలి



రాజంపేట అర్బన్, జనవరి 8 ప్రభాతవార్త

రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న మద్యంతర భృతిని 30 శాతానికి తగ్గకుండా వెంటనే ప్రకటించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు కోరారు.రాజంపేట మండల వనరుల కేంద్రం లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశం లో ఆయన మాట్లాడుతూ 2023 జూలై ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పిఆర్సి అమలు చేయవలసి ఉన్నప్పటికీ ఇంతవరకు 12వ వేతన సవరణ సంఘం చైర్మన్ ను గాని సభ్యులను గాని నియమించలేదని విచారణ వ్యక్తం చేశారు. వెంటనే పిఆర్సి కమిషన్ నియమించి నివేదిక సమర్పించే లోగా ఉద్యోగ ఉపాధ్యాయులు నష్టపోకుండా సంక్రాంతి కానుకగా ఉద్యోగులకు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా ఇప్పటికే పెండింగ్లో ఉన్న రెండు డి ఏ లతో పాటు మధ్యంతర భృతిని కూడా కచ్చితంగా ప్రకటించాలని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, ఏకీకృత సర్వీసు నిబంధనలు, తదితర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించే బాధ్యత తీసుకోవాలని కోరినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట (ఎన్ టి ఏ )నోబెల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు సోమశేఖర్, జమాల్ భాష, వీరప్రసాద్, వెంకటసుబ్బయ్య, బ్రహ్మయ్య, హరిప్రసాద్, రమణ, ఉమామహేశ్వర తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌టిఏ అధ్యక్ష కార్యదర్శులుగా జమాల్ భాషా, హరిప్రసాద్

రాజంపేట అర్బన్ ,జనవరి 8 ప్రభాతవార్త

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాజంపేట మండలశాఖ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులుగా ఎస్. జమాల్ బాషా ,హరి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు సమక్షంలో రాజంపేట, నందలూరు, పెనమలూరు మండలాల నూతన కార్యవర్గాల ఎన్నిక జరిగింది. నందలూరు మండల శాఖ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులుగా ఆదిల్ బాషా, వెంకటసుబ్బయ్యలు ఎన్నికయ్యారు. అలాగే పెనగలూరు మండల శాఖ అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులుగా పి. వెంకటరమణ, బి,రవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎన్నికైన ఉపాధ్యాయులను శ్రీనివాస్ రాజు అభినందించారు. అసోసియేషన్ కోసం అంకితభావంతో పని చేయాలని సూచించారు.

## బ్రాహ్మణపల్లిలో వైద్య శిబిరం

పులివెందుల రూరల్, జనవరి 8, ప్రభాతవార్త :

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలకు చెందిన నాల్గవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు "జాతీయ సేవా పథకం" లో భాగంగా ఏడు రోజుల పాటు అనగా 04 జనవరి నుండి 10 జనవరి వరకు గ్రామంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఐదవ రోజు బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు అనంతరం పార్థినియం వయ్యారి భామ కలుపు మొక్క నియంత్రణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్. పవన్ కుమార్ రెడ్డి, సచివాలయం ఏ.ఎన్.ఎమ్ శైలజ, ఏ.ఎన్.ఎమ్ లక్ష్మి దేవి, ఆశా వర్కర్ మహాలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు కొన్ని రక్త పరీక్ష, బి.పి పరీక్షలు, షుగర్ పరీక్షలు చేశారు. గ్రామస్థులకు విటమిన్, కాల్షియమ్ , షుగర్, నరాల బలహీనత, ఆస్తమా, గ్యాస్ట్రిక్, డయాబెటిస్, జ్వరానికి, నొప్పులకు, వాపులకు, స్కిన్ ఎలర్జీ, బలానికి వంటి సమస్యలకు మాత్రలు ఉచితంగా పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో జాతియ సేవా పథకము కార్యక్రమ అధికారులు డాక్టర్. జయమ్మ, డాక్టర్ నివేదిత, అధ్యాపకులు డాక్టర్ రాజేష్, ఎన్.వి. సుబ్బారెడ్డి, కె. సుబ్బారెడ్డి, నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కూల్ డ్రింక్ స్టాక్ పాయింట్‌లో భారీ పేలుడు

తంబళ్లపల్లె జనవరి 8 ప్రభాతవార్త



తంబళ్లపల్లె మండల కేంద్రం సమీపంలోని చేలూరి వాండ్లపల్లె వద్ద గల కూల్ డ్రింక్ స్టాక్ పాయింట్లో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో భారీ పేలుడు సంభవించి భవనం పూర్తిగా దెబ్బతినడంతో పాటు భవనంలోని కూల్ డ్రింకులు, వస్తు సామాగ్రి కాలి సుమారు రూ 30 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. మంగళవారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో కూల్ డ్రింక్ స్టాక్ పాయింట్ యజమాని టిడిపి నాయకుడు పురుషోత్తం కుటుంబం పక్క భవనంలో నిద్రిస్తుండగా ఉన్నట్టుండి పెద్ద పేలుడుతో మంటలు చెలరేగాయి. హుటాహుటిన పురుషోత్తం తోపాటు పలువురు గ్రామస్తులు మంటలు ఆర్పడానికి తీవ్రంగా కష్టపడ్డారు. ఈ సందర్బంగా యజమాని పురుషోత్తం కు స్వల్ప గాయాలయ్యాయి. ఉదయం ఎస్పై లోకేష్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్ధమ్మ, పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు సందర్శించి ప్రమాదం జరిగిన విషయాలను కనుగొని విచారం వ్యక్తం చేశారు.

## పిపిఆర్ వ్యాక్సినేషన్ తప్పక వేయించాలి

చిట్వేలి, జనవరి 8, ప్రభాతవార్త:



మేకలు,గొర్రెలు పెంపకం దారులు పిపిఆర్ వ్యాక్సినేషన్ తప్పక వేయించాలని మండల పశువైద్యరాలు భువనేశ్వరి అన్నారు. ఈ క్రమంలో భాగంగా బుధవారం రాజకుంట గ్రామ సచివాలయ పరిధిలో గ్రామస్థాయి వైద్య సిబ్బంది వ్యాక్సినేషన్ నిర్వహించారు. డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ వాతావరణ ప్రతికూలతతో వ్యాపించే వ్యాధులతో కలిగే మరణాల రేటును ముందస్తు పిపిఆర్ వ్యాక్సిన్ తో నివారించవచ్చని తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తప్పక ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర శివప్రసాద్, పశు వైద్య సిబ్బంది బాలాజీ, అరవింద్, గోవర్ధన్, ప్రీతిస్సీలు పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయండి

పులివెందుల, జనవరి 8, ప్రభాతవార్త :



పులివెందులలోని శిల్పారామం, ఉలిమెళ్ల లేక్ లలో నిర్వహించే సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని పరిపాలనాధికారి సుధాకర్ కోరారు. పులివెందుల లోని శిల్పారామం, ఉలిమెళ్ల లేక్ లలో సంక్రాంతి సంబరాలకు సంబంధించిన గోడ పత్రాలను సిబ్బందితో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిల్పారామంలో ఈ నెల 12న సాయంత్రం చుక్కల ముగ్గుల పోటీలు, 13న భోగి మంటలు, ,ఇంద్రజాల ప్రదర్శన, 14న గాలిపటాల పండుగ, నృత్య ప్రదర్శనలు, ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతుల ప్రధానం, 15న నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఉలిమెళ్ల లేక్ లో 13 న భోగి మంటలు, నృత్య ప్రదర్శనలు, 14, 15 తేదీల్లో నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకటసుబ్బయ్య, ఫీల్డ్ సూపర్ వైజర్లు ఇస్మాయిల్, సుబ్బారావు, వరప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్వీస్ ప్రొవైడర్స్ ద్వారా చేతివృత్తులకు ఉపాధి



మైదుకూరు, జనవరి 08, ప్రభాతవార్త:

మున్సిపాలిటీ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆఫీసు నందు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్స్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. పట్టణ పరిధిలోని బ్యూటిషియన్స్,పెయింటర్స్, కార్పెంటర్స్, ప్లంబర్, ఏసి, వాషింగ్ మిషన్, ఫ్రిడ్జ్ వంటి వాటికి మరమ్మతులు పనిచేసే వారందరూ మెప్మా ఆఫీస్ నందు పేర్లు నమోదు చేసుకోవడం జరిగింది. మెప్మా వీరి ద్వారా హోమ్ ట్రయాంగిల్ వేదిక ద్వారా సేవలు అందించడంతోపాటు వారికి ఉపాధి కలిగించేందుకు ఈ దోహదపడుతుందని తెలపడం జరిగింది. అంతేకాకుండా మహిళా గ్రూపుల మాదిరిగానే మగవారికి కూడా ఒక వృత్తి వారిని గ్రూపుగా తయారు చేసి ద్వాక్రా లో ఉన్న సదుపాయాలను కల్పించడం జరుగుతుందని కార్యక్రమాన్ని ఉద్దేశించి సి.ఓ పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా టి.ఐ కె.కేజియా, జాస్లీన్, సి.ఓ పుల్లయ్య, రమణమ్మ, ఆర్పీలు పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో 70 మంది సభ్యులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

రామాపురం: జనవరి 08, ప్రభాతవార్త

గ్రామాలలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులో చేపట్టిందని తాసిల్దార్ రామాంజనేయులు అన్నారు. మండలంలోని చిట్లూరులో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో భూ సమస్యలు ఉన్న పరిష్కరించుకోవడానికి ప్రజలు రెవిన్యూ సదస్సను వినియోగించుకోని పరిష్కరించుకోవాలన్నారు. భూమి కొలతలు తక్కువఉన్న ఆన్లైన్ సమస్యలు ఉన్న రిసర్వే లో భూమి తక్కువ చూపించిన వన్ బి అడంగల్ ఇతర సమస్యలున్న ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. అనంతరం గ్రామ ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం అర్జులు అందజేశారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి మని దేవదాయ శాఖ అధికారి అధికారి విశ్వనాథ్ టిడిపి నాయకులు సురేంద్ర రెడ్డి. దేవదర్శన్ రెడ్డి. చిన్న కృష్ణారెడ్డి. రామకృష్ణ గౌడ్. తుమ్మల ఓబులేసు. ప్రభాకర్. లక్ష్మయ్య. మానిటింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు గంప వెంకటరమణ. రెవిన్యూ అధికారులు సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వరద



ప్రొద్దుటూరు జనవరి 8 ప్రభాతవార్త

గౌడ ఈడిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు దొంత రామయ్య గౌడ్ ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి మరియు బిసి టిడిపి నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్ చేతుల మీదుగా బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ది ప్రొద్దుటూరు గౌడ ఈడిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో పాటు చల్లా రాజగోపాల్ యాదవ్‌లను ఘనంగా సత్కరించారు. గత సార్వత్రిక ఎన్నికలలో గౌడ ఈడిగ సామాజిక వర్గమంతా తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం శ్రమించిందని చల్ల రాజగోపాల్ యాదవ్ ఎమ్మెల్యే వరదకు గుర్తు చేశారు. అలాగే గౌడ సంఘం పట్టణ అధ్యక్షులు రామయ్య గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సామాజిక వర్గాన్ని ఏకం చేసి టిడిపి గెలుపుకు సహకరించారన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఆర్‌గోపాల్‌గౌడ్ బి రాజశేఖర్ గౌడ్ గౌరవ సలహాదారులు జి.వెంకటసుబ్బయ్య గౌడ్, జి రామసుబ్బయ్య గౌడ్, కొర్రపాటి భాస్కర్ గౌడ్ గౌడ సంఘం యూత్ అధ్యక్షులు పి.వి.ఆర్ గౌడ్ గౌడ సంఘం డైరెక్టర్ పి రమణగౌడ్, ఉపాధ్యక్షులు సుమంత్‌గౌడ్ కార్యదర్శి రామకృష్ణ సంఘం నాయకులు భాస్కర్ గౌడ్ దొంత వెంకటసుబ్బయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కిశోర బాలికల సమతుల ఆహారంపై శిక్షణ



మైదుకూరు, జనవరి 08, ప్రభాతవార్త:

అంగన్వాడి కార్యకర్తలకు, మహిళలు, కిశోర బాలికల సమతుల ఆహారంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కెవికె సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి యం.బాలకృష్ణ, మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికల ఆహారపు అలవాట్లు, చిరుధాన్యాల ప్రాముఖ్యత,వాటి వల్ల ఆరోగ్యం మెరుగుపరుచుకోవడం, కూరగాయలు, ఆకుకూరల ఆహారంలో భాగం చేసుకోవాలని తెలియజేశారు. ఐసిడిఎస్, జిడిపిఓ, శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు బాలింతలే కాక కిషోర్ బాలికల ఆరోగ్యం మరియు ఆహారపు అలవాట్లపై అంగన్వాడి కార్యకర్తలను శ్రద్ధ వహించాలని తెలియజేశారు.గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీ విద్యా రాణి అంగన్వాడి కేంద్రాలలో కూరగాయలు పెంచుకొని, వాటిని ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలియజేశారు. శాస్త్రవేత్త ఉద్యాన విభాగం ఎస్ ఫిరోజ్ హుస్సేన్, మహిళల్లో రక్తహీనత గురించి, దానివలన వివిధ దశల్లో వాళ్ళు ఎదుర్కొనే సవాళ్ల గురించి వివరించారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త బిఎన్ కాంతి శ్రీ ఈ కార్యక్రమాన్ని కెవికెలో నిర్వహించి కిశోర బాలికల సమతుల ఆహారం, అవశ్యకత మరియు మహిళలు వారి జీవితకాలంలో వివిధ దశల్లో తీసుకోవలసిన ఆహార నియమాల గురించి విపులంగా వివరించడం జరిగింది. ఈ రోజుల్లో కిశోర బాలికలు జంక్ ఫుడ్ మరియు ప్రాసెస్ డ్ ఫుడ్ తినడం వల్ల కలిగే నష్టాల గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మైదుకూరు, జీవి సత్రం, క్లస్టర్ నుండి 47 మంది అంగన్వాడి కార్యకర్తలు ముగ్గురు సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## 90 సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం



పెద్దమండెం జనవరి 8 ప్రభాత వార్త

మండలంలోని శివపురం రెవెన్యూ సదస్సులో బుధవారం 90 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు తహసిల్దార్ సయాద్ అహ్మద్ పేర్కొన్నారు మిగిలిన తదితర సమస్యలు 80 కి పైగా ఫిర్యాదుల అందినట్లు తెలిపారు వాటిని గడువులోగా పరిష్కరిస్తామని తెలిపారు గత ప్రభుత్వంలో జరిగిన ఈ సర్వే సిద్దవరం శివపురం గ్రామపంచాయతీలలో తప్పులతడకగా జరిపినట్లు తెలిపారు వీటిని పరిష్కరించడానికి చాలా తిప్పలు పడాల్సి వస్తుందని అన్నారు అయినా వాటిని సకాలంలో పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు గతంలో జరిగిన తప్పులను మళ్లీ పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు అధికంగా భూ సమస్యలు అందులో భూముల తారుమారు డీకేటి కాలువలో పోయిన భూములు తదితర వాటిపై అధిక సంఖ్యలో ఫిర్యాదుల అందినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్ తంబళ్లపల్లె సబ్ రిజిస్టర్ రూపేష్ తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు నాగేశ్వర్ రెడ్డి సిద్దవరం ప్రసాద్ రమణారెడ్డి సచివాలయ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిటి కళాశాలను యూనివర్సిటీ చేయాలి



మదనపల్లెక్రైం, జనవరి 8 ప్రభాతవార్త :

బిటి కళాశాలలో వెంటనే యూనివర్సిటీ కార్యక్రమాలు ప్రారంభించాలని బిఎస్పి నాయకుడు బందెల గౌతమ్, జనసేన నాయకులు రాందాస్‌చౌదరిలు డిమాండ్ చేశారు. బుధవారం బహుజన సమాజ్‌వాది పార్టీ అధ్వర్యంలో బిటి కళాశాలలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం బిటి కళాశాలను యూనివర్సిటీ మార్పు చేస్తున్నట్లు జివో తీసుకుని రావటం జరిగిందన్నారు. అయితే యూనివర్సిటీ కార్యక్రమాలు ఏవి ఇంతవరకూ జరగలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే బిటి కళాశాలను యూనివర్సిటీగా మార్పు చేసి కళాశాల అభివృద్ధికి తోడ్పాలని కోరారు. ఎంతో చరిత్ర కల్గిన బిటి కళాశాలకు పూర్వవైభవం తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. ఇందుకోసం బిఎస్పి తరుపున ఉద్యమం చేయటానికి వెనకాడమన్నారు. అలాగే మదనపల్లెలో ఏర్పాటు చేసే మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయటం మానుకుని ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు సాంబశివ, శ్రీనివాసులు, రెడ్డిసాబ్, మురళి, వైఎస్ మునిరత్నం, హరినాథ్‌శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నెలకు పదివేల రూపాయల ఆదాయం రావాలి

యర్రగుంట్ల జనవరి 8 ప్రభాతవార్త



వ్యవసాయం చేస్తున్న రైతులు 10 శాతం భూమిలో చేపల పెంపకం చేపడితే మంచి లాభాలు వస్తాయని డిఆర్డిఏ పిడి ఆనంద నాయక్ తెలిపారు. పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న వెలుగు కార్యాలయంలో చిలమకూరు గ్రామ రైతులతో అధికారులు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆనంద నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుకు ప్రతినెల 10 వేల రూపాయలు ఆదాయం రావాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేస్తుందని తెలిపారు. పిఎంఈజిపి పథకం ద్వారా చాపల పెంపకం కొరకు 90 శాతం నుంచి 95 శాతం రుణాలు బ్యాంకుల నుంచి పొందవచ్చని తెలిపారు. ఈ రుణంలో ప్రభుత్వము 35 శాతం సబ్సిడీని, ఓసి పురుషులకు 25 శాతం సబ్సిడీని ఇస్తుందని తెలిపారు. ఉదయ్ ఆక్వా మేనేజ్మెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ ఇది రైతులకు ప్రత్యామ్నాయ ఉపాధి, చాపల పెంపకం వాడిన నీటిని పంట పొలాలకు వాడుకోవచ్చు అని, వీటి మార్కెటింగ్ ఉదయ్ ఆక్వా మేనేజ్మెంట్ ద్వారా జరుపుతుందని అందరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఆనంద నాయక్,ఉదయ్ ఆక్వా మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, ఈమ ఏపిఎం జగదీశ్వరి, ఏవో శ్రీకాంత్ రెడ్డి, ఎఫ్ఈఓ ఓబిలు, చిలమకూరు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధిలో ముందు ఉంటుంది

యర్రగుంట్ల జనవరి 8 ప్రభాత వార్త

ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పీఎం శ్రీ ఫండ్స్ సహకారంతో పాఠశాల క్రీడా మైదానంలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ రెడీ చేయడం జరిగింది. ఇదేవిధంగా ప్రతి సంవత్సరం పిఎం శ్రీ ఫండ్స్ అందుతాయని ఈ ఫండ్స్ తో ముందు హాకీ కోర్టు, కబాడీ కోర్టు ,కోకో కోర్టు, వస్తాయని క్రీడలకు మాత్రమే కాకుండా పాఠశాల అభివృద్ధి కూడా జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు యస్ రామాంజనేయ రెడ్డి ఆదేశాలతో తుపాకుల చంద్ర ఓబుల్ రెడ్డి తెలిపారు.



# మామిడి పంట రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పైన శిక్షణ

**చిన్నమండెం జనవరి8 ప్రభాతవార్త :**

మండలంలోనీ చిన్నమండెం, పడమటి కోన యూనిట్ పరిధిలో ఉన్న మామిడి రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానాల పైన రైతు సాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఏడిఏ శ్రీలత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి తక్కువ ఖర్చుతో అధిక ఆదాయాలు పొందాలని మన ఆరోగ్యాలతో పాటు నేల ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు. ప్రతి రైతు ద్రవ జీవామృతం మరియు ఘనజీవామృతం వేసుకుని భూసారాన్ని పెంచుకోవాలని చెప్పారు. ఏపిఎం రెడ్డమ్మ మాట్లాడుతూ రసాయన ఎరువులు మరియు పురుగుమందులు అధిక మోతాదులో వాడడం వలన అనేక రకమైన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వాటన్నిటి నుండి బయటపడాలి అంటే ప్రతి రైతు కచ్చితంగా ప్రకృతి వ్యవసాయం ఆచరించాలని చెప్పారు. అలాగే మహిళా సంఘాల ద్వారా రైతు ఉత్పాదక సంఘం ఏర్పాటు చేస్తున్నామని మహిళా రైతులు అందులో సభ్యులుగా చేరి వాటిలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ మండల టీం లీడ్ చందు రెడ్డి మామిడి పంటలో పాటించవలసిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రైతులకు తెలియజేశారు. మామిడిలో వచ్చే ప్ర



ధాన పురుగులు మరియు తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయ కషాయాలు ద్వారా ఏ విధంగా నివారించుకోవచ్చు అనేది క్లుప్తంగా వివరించారు. మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ పద్మావతి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు పండించినటువంటి ఉత్పత్తులకు మార్కెటింగ్ లో ఉన్న అవకాశాలను తెలియజేశారు. ట్రైనింగ్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ ఆదర్శ రైతు మురళి కృష్ణ మామిడి తోటలను రైతులు పరిశీలించి వారు పాటించిన పద్ధతులను తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో రెడ్డెన్న, అంజలి, బ్లెస్సి, అనూష, జుతితి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఇంటర్న్, రైతులు పాల్గొన్నారు.

# పదిలో ఉత్తమ ఫలితాల కోసం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

**సంబేపల్లి జనవరి 8 ప్రభాతవార్త**

మార్చిలో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం సూచించారు. బుధవారం మధ్యాహ్నం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సిలబస్ పూర్తయిందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి పునాది వంటిదన్నారు. లక్ష్య సాధన కోసం పట్టుదల, అంకితభావంతో బాగా చదవాలన్నారు. పరీక్షలలో చూచి రాతలు ఉండవని, అత్యంత పగడ్బందీగా పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగ్రహణాత్మక పరీక్షలలో వచ్చిన మార్కులు ఆధారంగా పదవ తరగతి విద్యార్థులను ఏ,బి,సి, డి గ్రూపులుగా విభజించాలన్నారు. డి గ్రూపులోని విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక అనుసరించాలన్నారు. ముఖ్యమైన భావనలపై, పట్టికలపై, పటాలపై వారికి తర్ఫీదు ఇవ్వడం ద్వారా వారిని కూడా ఉత్తీర్ణులను చేయవచ్చన్నారు. సబ్జెక్టు వారీగా ముఖ్యమైన మూడు మాదిరి ప్రశ్నాపత్రాలను రూపొందించాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం ఎస్సీఈఆర్టీ రూపొందించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ ను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం ఏకలవ్య ఫౌండేషన్ వారి



ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు రుక్సానా, మోనిక, తరుణ్ కుమార్ గౌడ్ లకు మెమొంటోలను ఇచ్చి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, ఏకలవ్య పాఠశాల కోఆర్డినేటర్ రెడ్డి శేఖర్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు కలకడ ఆదర్శ పాఠశాల ఎంపిక

**కలకడ జనవరి 08 ప్రభాతవార్త ః**



జాతీయ స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు కలకడ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మలంగ్ షావలి తెలిపారు. బుధవారం రోజు విజయవాడలోని మురళి రిసార్ట్ లో జరిగిన రాష్ట్రస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో వివిధ జిల్లాల నుంచి ప్రదర్శనలు ప్రదర్శించారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా నుండి కలకడ ఆదర్శ పాఠశాలకు చెందిన బయో ఇంజిన్ అండ్ బయో కెమికల్ క్లీనర్స్ అనే విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను సుమతి కెమిస్ట్రీ ఉపాధ్యాయురాలి పర్యవేక్షణలో విద్యార్థులు బిఎండి సుహేల్ మరియు ఎస్ఎండి రేహాన్ లు ప్రదర్శించారు. రాష్ట్రస్థాయి న్యాయ నిర్ణేతలు కలకడ ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రాజెక్టును జాతీయ స్థాయికి ఎంపిక చేయడం జరిగింది త్వరలో పుదుచ్చేరిలో జరగబోయే జాతీయస్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో ఈ ప్రాజెక్టు ప్రదర్శింపబడుతుంది ఈ ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైనందుకు ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్ నాయుడు ప్రిన్సిపల్ కె మలాంషావలి మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులను మరియు ఉపాధ్యాయురాలు సుమతీని అభినందించారు.

## జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు

# కోన విద్యార్థులు ఎంపిక





**కలకడ జనవరి 08 ప్రభాతవార్త ః**

జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మోడెమ్ చెంగల్ రాయుడు తెలిపారు. గత సంవత్సరం రాజమండ్రి విజయవాడలో జరిగినటువంటి రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మిడపల యోగేశ్వర్, షేక్ సమీరా జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. వీరు జనవరి 10 నుండి తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో జరిగే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో ఆడనున్నట్లు తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఆకుల ఝాన్సీ రాణిని, ఎంపికైన విద్యార్థులను, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## పులివెందుల విద్యార్థి హేమలతకు డాక్టరేట్

**పులివెందుల, జనవరి 8, ప్రభాతవార్త :**



పులివెందుల భాకరాపురానికి చెందిన రవిశేఖర్, కృష్ణమ్మ దంపతులు కుమార్తె హేమలత కు డాక్టరేట్ ఇచ్చారు. పర్యావరణ సహిత మానవ శరీరంలో ఔషధ సరఫరా, గాయాలను త్వరితగతిన నయం చేయడానికి నానో డ్రగ్ కనుగొన్న రసాయన శాస్త్ర శాఖ స్కాలర్ డి. హేమలత కు యోగి వేమన విశ్వవిద్యాలయం డాక్టరేట్ ను ప్రకటించింది. రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు కె.ఎస్.వి. కృష్ణారావు పర్యవేక్షణలో సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ పాలి శాఖ రాయిడ్ బేస్డ్ హైడ్రోజెన్స్ ఫర్ కంట్రోల్ రిలీజ్ ఆఫ్ కీమోథెరపీ ఏజెంట్స్ అండ్ యాంటీ మైక్రోబియన్ అప్లికేషన్ అనే అంశంపై పరిశోధన చేసిన సిద్ధాంత గ్రంథం విశ్వవిద్యాలయానికి సమర్పించారు. డి. హేమలత కు డాక్టరేట్ సర్టిఫికెట్ ను వైవీయూ పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు జారీ చేశారు. ఈమె చేసిన సిద్ధాంత అంశంపై పలు ప్రఖ్యాత అంతర్జాతీయ పబ్లికేషన్స్ ఎల్సి వేర్, అమెరికన్ కెమికల్ సొసైటీ, స్ప్రింజర్ వంటి జర్నల్స్ లో పరిశోధనా పత్రాలు, బుక్ చాప్టర్స్ ప్రచురించారు. వైవీయూ రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్న డి.హేమలతను తండ్రి రవి శేఖర్, పరిశోధన గైడ్ డాక్టర్ కె ఎస్ వి కృష్ణారావును ఉపకులపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, కులసచివులు ఆచార్య పి పద్మ , ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి, రసాయన శాస్త్ర అధ్యాపకులు పరిశోధక విద్యార్థులు అభినందించారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఏఐటిఎస్ భారీ ర్యాలీ

**పాల్గొన్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, అన్నమాచార్య ఛాన్సలర్ గంగిరెడ్డి**



**(అన్నమయ్య ప్రతినిధి, ప్రభాతవార్త )**

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అన్నమాచార్య యూనివర్సిటీ విద్యార్థులు యూనివర్సిటీ రజతోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం ఉదయం సే నో టు డ్రగ్స్ వాక్ అగైనెస్ట్ డ్రగ్స్ పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రారంభోత్సవానికి అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ముఖ్య అతిథిగా, విశ్వవిద్యాలయ చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి విశిష్ట అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్య సాగర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు డ్రగ్స్ మరియు ఇతర మాదకద్రవ్యాలకు బానిస కాకుండా మరియు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ప్రాంగణం నుండి రాజంపేట పట్టణం కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్ వరకు 3 కిలోమీటర్ల భారీ ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. రాజంపేట పాత బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి సే నోటు డ్రగ్స్ వాక్ అగైనెస్ట్ డ్రగ్స్ పేరిట విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముందు ప్రముఖ సినీనటులు, వ్యక్తిత్వ వికాస శిక్షకులు కేవీ ప్రదీప్ విద్యార్థులను తన ప్రేరణ ప్రసంగంతో ఉత్సాహపరిచారు.

## జాతీయ యువజనోత్సవాలకు జ్ఞానాంభిక విద్యార్థినులు



**మదనపల్లె, జనవరి 8 ప్రభాతవార్త :**

జాతీయస్థాయి యువజనోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మదనపల్లె జ్ఞానాంభిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సి.సాయిగ్రేస్ ఓ ప్రకటనలో తెలిపారు. యువజన సర్వీసస్ శాఖ, స్టెప్ అన్నమయ్య జిల్లా ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్ 29న జరిగిన జిల్లా యువజనోత్సవ పోటీల్లో జానపద నృత్యం నందు జ్ఞానాంభిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రథమ బహుమతి పొందారన్నారు. బంజారా నృత్యం నందు విద్యార్థినులు పలువురిని అలరింపచేసి ప్రథమ బహుమతి పొందడం జరిగింది. జనవరి 11, 12, ఢిల్లీలో జరిగే జాతీయ యువజనోత్సవాల్లో వీరు పాల్గొనున్నట్లు తెలిపారు. జాతీయ యువజనోత్సవాలకు జ్ఞానాంభిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక కావడం పట్ల కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవిలను పలువురు అభినందించారు.

# ఘనంగా రజతోత్సవ వేడుకలు




**రాజంపేట, జనవరి 8 (ప్రభాతవార్త )**

రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా రాజ్యసభ సభ్యులు మేడ రఘునాథ్ రెడ్డి, ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి సతీష్ రెడ్డిలు ముఖ్య అతిధులుగా, విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి పాల్గొన్నారు. ఈ రజతోత్సవాలలో భాగంగా భారత ప్రభుత్వ సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ వారిచే అనుమతించబడిన అన్నమాచార్య కమ్యూనిటీ రేడియో స్టేషన్ 98.6 మెగా హెడ్జెస్ ని వేడుకకు విచ్చేసిన ముఖ్య అతిథులు మేడ రఘునాథ్ రెడ్డి, డాక్టర్ జి సతీష్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకొని సిల్వర్ జూబ్లీ జరుపుకుంటుందంటే రాయలసీమ ప్రాంతానికే గర్వకారణమన్నారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ జి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంస్థ నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా విద్యార్థులలో సృజనాత్మకత, పట్టుదల మరియు విలువలను పెంపొందించడంలో తోడ్పడిందన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ రజతోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ రంగాలకు చెందిన 25 మంది ప్రముఖులను అన్నమాచార్య యూనివర్సిటీ రెసోనన్స్ అవార్డ్స్ (ఎయుఆర్ఏ)అవార్డ్స్‌తో సత్కరించడం తమకు గర్వకారణం అని తెలిపారు. ఈ వేడుకను మొదటగా విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రత్యేక నృత్యాలు పాటలతో ప్రారంభించి తోటి విద్యార్థులను అలరించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సి రామచంద్ర రెడ్డి, అన్నమాచార్య ట్రస్ట్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రో ఛాన్సలర్ శ్రీ అభిషేక్ రెడ్డి, విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్ మల్లికార్జున రావు, డీన్లు, హెచ్వోడీలు మరియు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కరువు నివేదికలను ప్రభుత్వానికి నివేదిస్తాం



**వాల్మీకి పురం, జనవరి 08 ప్రభాతవార్త ః**

మండలంలోని జర్రావారిపల్లె గ్రామంలో బుధవారం మధ్యాహ్నం కేంద్ర కరువు బృందం పర్యటించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కర వు పరిస్థితులపై ఫోటో ప్రదర్శనను పరిశీలించి స్థానిక స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జరిగిన ముఖాముఖిలో రైతులు పలు సమస్యలను కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లి విన్నవించుకున్నారు. రైతులకు ఉచితంగా పశుగ్రాసం విత్తనాలు అందజేయాలని, వ్యవసాయ పనులను ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయాలని, హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి గ్రామానికి సాగు, తాగునీటి సరఫరా సౌకర్యాలు కల్పించాలని, ప్రస్తుత వ్యవసాయ స్థితిగతులపై ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర కరువు బృందానికి విన్నవించారు. దీనిపై స్పం దించిన కరువు బృందం అధికారులు పూర్తి సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సహాయక చర్యలు చేపట్టేలా చూడడం జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న రైతుల ను సమస్యలను ఆడిట్ అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె సబ్కలెక్టర్ మేఘస్వరూప్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, తహసీల్దార్ పామిలేటి, ఇతర జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, కూటమి పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## రాజంపేట నుంచి రైల్వేకోడూరు వరకు

# రైళ్ల స్టాపింగ్ పునరుద్ధరించాలి

**గుంతకల్లు సీనియర్ డి.సి.ఎం ను కోరిన బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్**



**(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త )**

రాజంపేట నుంచి రైల్వేకోడూరు వరకు పాత విధానంలో రైళ్ల స్టాపింగ్ పునరుద్ధరించాలని బిజెపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ గుంతకల్లు సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ మనోజ్ కుమార్ ను కోరారు. బుధవారం రాజంపేట రైల్వే స్టేషన్ కు తనిఖీల నిమిత్తం విచ్చేసిన మనోజ్ కుమార్‌ను సాయి లోకేష్ బిజెపి నాయకులతో మర్యాదపూర్వకంగా కలిశారు. తన అభ్యర్థన మేరకు రాజంపేటలో జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు స్టాపింగ్‌కు సహకరించినందుకు సాయి లోకేష్ మనోజ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయి లోకేష్ మాట్లాడుతూ కోవిడ్ కు ముందు నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లి, రైల్వే కోడూరులలో ఏవైతే స్టాపింగ్ ఉండేదో తిరిగి రైళ్ల స్టాపింగ్ అదేవిధంగా పునరుద్ధరించాలని కోరడం జరిగింది. ఇందుకు ఎస్‌డిసిఎం మనోజ్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు సాయిలోకేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు గంగిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శివాజు, భనుప్రకాష్‌రాజు, నరేంద్ర పాల్గొన్నారు.

## కేంద్ర రవాణాశాఖ మంత్రిని కలిసిన జయచంద్రారెడ్డి

**మొలకలచెరువు, జనవరి 8 ప్రభాతవార్త :**



ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కారిని తంబళ్లపల్లె నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ దాసరిపల్లె జయచంద్రారెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ట్రాన్స్‌పోర్ట్ డెవలప్‌మెంటు కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర క్రీడా రవాణాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధి విధానాలపై, రవాణా వ్యవస్థపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఏపి రవాణా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కేంద్రం అనుసరిస్తున్న నూతన రవాణా సాంకేతికతను అడిగి తెలుసుకొన్నారు. ఈ సమావేశంలో దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల రవాణాశాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

**బద్వేల్ అర్బన్, జనవరి 8 ప్రభాతవార్త**




సమ్మె కాలపు ఒప్పందాల జీవోను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 10వ తేదీ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించే కార్మికుల రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాం ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక సిఐటియు పట్టణ కార్యాలయం నందు పాత్రికేయుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మున్సిపల్ కార్మికులు గత సంవత్సరం నిర్వహించిన 17 రోజుల సమ్మె ముగిసి సంవత్సరమైనా రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియో, దహన సంస్కారాలకు 20 వేలు, ఇంజనీరింగ్ కార్మికుల జీతాలపెంపు, సంక్షేమపథకాలు, పర్మినెంట్ కార్మికులకు సరండర్ లీవ్‌లు తదితర హామీలకు వెంటనే జిఓలు అమలు కాలేదు అన్నారు. ఈ డిమాండ్ల సాధనకోసం గత ఏడాది సమ్మె ముగిసిన రోజు అయిన జనవరి 10 వ తేది అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని కార్మికులను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు, యూనియన్ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు దియ్యాల దేవమ్మ, శ్రీనివాసులు, కోశాధికారి కాలువ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఢిల్లీ ప్రబ్లిక్ స్కూల్ విద్యార్థి

**మదనపల్లెక్రైం, జనవరి 8 ప్రభాతవార్త :**



ఢిల్లీ ప్రబ్లిక్ స్కూల్ విద్యార్థి జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు పాఠశాల ఛైర్‌పర్సన్లు అమృత, శ్రీదేవిలు తెలిపారు. ఢిల్లీ ప్రబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జి.లోహిత్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటడంతో అతన్ని అండర్ -14 కేటగిరిలో అథ్లెటిక్స్‌కు ఎంపిక కావటం జరిగింది. జార్ఖండ్ రాష్ట్రంలో ఈనెల 11 నుంచి 14వ తేది వరకూ జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో లోహిత్ పాల్గొనటం జరుగుతంది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన లోహిత్‌ను ఛైర్‌పర్సన్లు, ప్రిన్సిపాల్ షహనాజ్‌ఖాన్, వైస్‌ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, పిఈటిలు మహమ్మద్‌అలీ, భానుప్రకాష్, రవి, షబరీష్‌లు అభినందించారు.

## ప్రధాని మోదీని కలిసిన ఎమ్మెల్యే ఆది



**జమ్మలమడుగు, జనవరి 8, ప్రభాతవార్త:**

విశాఖపట్నం వచ్చిన భారత ప్రధాని మోదీని ఎయిర్ పోర్టులో ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కలిసి స్వాగతం పలికారు. అనంతరం మోదీతో కాసేపు ముచ్చటించారు.

## రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా RDO




**అట్లూరు జనవరి 8 ప్రభాత వార్త :**

అట్లూరు మండలం కొండూరు పంచాయతీ నందు రెవెన్యూ సదస్సు కార్యక్రమం జరిగింది రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా RDO హాజరు కావడం జరిగింది. రైతులు నుంచి వచ్చిన అర్జీలు పరిశీలించి త్వరగా అందరికీ న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. అట్లూరు ఎమ్మార్వో మరియు ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకుడు బోవిల్లా నందగోపాల్ రెడ్డి, పాపుదిప్పు మల్లికార్జునరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు పాలకొండు సుధారాణి, క్లస్టర్ ఇంచార్జ్ పాలకొండు రామచంద్రారెడ్డి, అట్లూరు మండల మాజీ అధ్యక్షులు అమర్నాథరెడ్డి, కొత్తపు మునిరెడ్డి, మన్యం మహేశ్వర్ రెడ్డి, బోవిల్ల జయ కృష్ణారెడ్డి, తెలుగు యూత్ అధ్యక్షుడు కొండూరు పంచాయతీ నీటి సంఘం అధ్యక్షులు అల్లం వెంకటసుబ్బయ్య యూనిటీ ఇంచార్జ్, చిలిపి కృష్ణారెడ్డి,తప్పెట గంగిరెడ్డి, పరమేష్ యాదవ్, రిషికేశవ, మరియు 12 పంచాయతీల టిడిపి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య హైస్కూల్‌లో ముగ్గుల పోటీలు

**వేంపల్లి, జనవరి 8, ప్రభాతవార్త :**

వేంపల్లి శ్రీ చైతన్య హై స్కూల్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులతో తమ ప్రతిభను చాటిచెప్పారు. పాఠశాల ఆవరణం రంగురంగుల ముగ్గులతో కళాత్మకంగా అలంకరించారు. సంప్రదాయ ముగ్గులతో పాటు, ఆధునిక శైలిలో రూపొందించిన డిజైన్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రతి ముగ్గులో విద్యార్థుల శ్రమ, కళాత్మకత స్పష్టంగా ప్రతిఫలించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి విద్యార్థుల కళానైపుణ్యాన్ని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు వారి సాంస్కృతిక అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్లు బి. చేతన్‌రెడ్డి, బి. చైతన్యరెడ్డి పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందించారు.



## ముందస్తు సంక్రాంతి సంబరాలు

**బద్వేల్ జనవరి 8 ప్రభాతవార్త :**

స్థానిక తెలుగు గంగా కాలనీలో ఉండే నారాయణ ఒలంపియాడ్ స్కూల్ నందు ముందస్తు సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. విద్యార్థిని విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా నూతన వస్త్రాలతో ఎంతో ముచ్చటగా ముస్తాబయ్యారు. పాఠశాల ప్రాంగణమంతా మామిడి తోరణాలతో, రంగురంగుల పూలతో, ముత్యాల ముగ్గులతో, గాలిపటాలతో, హరిదాసు కీర్తనలతో మార్మోగింది. విద్యార్థిని విద్యార్థులు వివిధ జానపద గేయాలకు నృత్యాలు చేయడం అందర్నీ ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపల్ కిషోర్ మాట్లాడుతూ సంక్రాంతి మూడు రోజుల పండుగని సూర్యుడు ధను రాశిలో నుండి మకర రాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రాంతి అంటారని, రైతులు కొత్త ధాన్యాన్ని ఇంటికి తెచ్చే శుభముహూర్తం అని తెలియజేశారు. అనంతరం చిన్నారులకు తల పైన భోగి పండ్లు వేసి ఆశీర్వదించారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేసి అందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎ జి యం నజీర్ అహ్మద్, ప్రిన్సిపల్ కిషోర్, అకాడమిక్ డీన్, వైస్ ప్రిన్సిపల్స్ , ఏ ఒ, మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## శివారు ప్రాంతాల్లో సౌకర్యాల కల్పనే ధ్యేయం

**మదనపల్లె, జనవరి 8 ప్రభాతవార్త :**

పట్టణ శివారు ప్రాంతాల్లో సామాన్య ప్రజల సౌకర్యాలే ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం పట్టణంలోని రెండవ వార్డు బికెపల్లి కళ్యాణ మండపం కాలనీ నందు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యేకు రోడ్లు, నీటిసౌకర్యం, మురుగునీటి కాలువల గురించి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బికెపల్లి ప్రాంతాల్లో ప్రజలు విన్నవించిన మౌళిక వసతుల కల్పనకు తక్షణం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజా అవసరాల మేరకు సిసిరోడ్లు,మురుగునీటి కాలువలు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీళ, టిడిపి నాయకులు రఘుపతినాయుడు, షంషీర్, నాగూర్‌వల్లి, మల్లికార్జునాయుడు, డ్యాన్స్ రెడ్డప్ప, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

**కమలాపురం, జనవరి 8, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కుప్పురివారిపల్లె ఎంపీపీ పాఠశాలను ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అలాగే ఉపాధ్యాయులతో మాట్లాడి పిల్లలకు మంచి విద్యను అందించాలని, అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత ఉండాలన్నారు. పాఠశాల అభివృద్ధికి ఏమైనా సహాయం కావాలంటే నా దృష్టికి తీసుకురండి అని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

